# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janasakthionline.com

సంపుటి : 47 సంచిక : 15 విజయవాడ 5-12-2014 పేజీలు : 8 వెల : రు 5.00




సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు, సీనియర్ నాయకులు కామ్రేడ్ షబ్బర్ హుస్సేన్ 2014 నవంబర్ 15న లక్నోలో మరణించారు. కా॥ షబ్బర్ హుస్సేన్ మరణంపట్ల సిపిఐ(ఎం-ఎల్) ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది. ఆ కామ్రేడ్‌కు విప్లవ జోహార్లర్పిస్తున్నది.

# స్వచ్ఛ భారత్‌ను కోరుకోనిదెవరు?

**పరిశుభ్రమైన** ఆరోగ్యకర వాతావరణంలో జీవించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. దేశంలో అతి ఎక్కువ మరణాలకు కారణమౌతున్న క్షయ వ్యాధికి కారణం పరిసరాల అపరిశుభ్రతే. వానాకాలం వచ్చినప్పుడల్లా అతిసారవ్యాధి ప్రబలి పసిపిల్లలు పండుటాకుల్లా రాలిపోవటానికి నీటి కాలుష్యమే కారణం. అపరిశుభ్ర వాతావరణం నుండి సంక్రమిస్తున్న వ్యాధులతో ప్రతి ఏడాదీ ప్రజలు తమ ఆదాయాల నుండి కోట్లాది రూపాయలు వెచ్చించి, అప్పుల పాలవుతున్న దుస్థితి నెలకొంది. బహుశా ప్రపంచంలోనే ఎక్కువ అపరిశుభ్ర వాతావరణం భారత్‌లోనే వుందనటం అతిశయోక్తి కాబోదు.

ఇక్కడ ప్రతి ఒక్కరూ వేసుకోవాల్సిన ప్రశ్న : ఇలా ఎందుకుంది? ఇంత అపరిశుభ్రత ఎందుకు పేరుకు పోతున్నది? ఈ పరిస్థితిని మార్చేందుకు ఏం చేశాం? ఇంకా ఏం చెయ్యాల్సివుంది? ఈ ప్రశ్నలు తలెత్తకుండా, కొట్టొచ్చినట్లు కన్పించే బహిరంగ మలవిసర్జనపైనే అదే అపరిశుభ్రతకు కారణమన్న ప్రచారం సాగిస్తున్నారు. వట్టి చేతులతో మలాన్ని తొలగించే వృత్తిని నిర్మూలించాలంటూ జాతీయోద్యమ కాలం నుండీ నినాదాలే తప్ప చేసిందేమీలేదు. నగరాలలో మురికి గొట్టాలను శుభ్రపరిచేందుకు ఎలాంటి రక్షణలు లేకుండా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు రోజూ అశువులు కోల్పోతున్నా పట్టించుకున్న పాపాన పోనివారికి, పరిశుభ్రత అప్పుడప్పుడూ గుర్తుకువచ్చి టి.వి. కెమేరాల ముందు చీపుళ్ళు పట్టుకు దర్శనమివ్వటం తరచుగా జరుగుతున్న తంతే. అపరిశుభ్రత మాత్రం తొలగిపోదు.

ఈ ప్రచారార్భాటపు నినాదాలను ప్రక్కన వుంచితే సమస్య మూలాలను గమనించగలం. మొట్టమొదటిగా గమనంలో వుంచుకోవలసింది భారత ప్రజలు సాంప్రదాయకంగానూ, సాంస్కృతికంగానూ పరిశుభ్రతను చాలా బాగా పాటిస్తారు. కళ్ళు తెరచి చూడండి. మట్టి పేడలతో అలికిన పేదల గుడిసెలు ఎంత పరిశుభ్రతను పాటిస్తాయో తెలుస్తుంది. మట్టి పాత్రలతో ఎంత పరిశుభ్రతగా వంట చేస్తారో కనిపిస్తుంది. మధ్యతరగతి ఇళ్ళలో కూడా ఇంతగానూ పరిశుభ్రత వుంటుంది. నీరు కాచివడపోసి తాగే అలవాటు వాటర్‌బాటిళ్ళ ప్రవేశంతో కనుమరుగయ్యింది.

మరి అపరిశుభ్రత ఎక్కడుంది? ఏ నగరం, పట్టణం, పల్లెనైనా చూడండి. కన్పించే చిత్రమొకటే. రోడ్ల మీద చెత్త పేరుకుపోయి వుంటుంది. నిర్మాణ సరుకులతో రోడ్లు నిండిపోతాయి. మురుగు కాల్వలు పొంగిపొరలుతుంటాయి. ఈ ఉమ్మడి వినియోగ ప్రాంతాలను పరిశుభ్రంగా వుంచవలసిందెవరు? స్థానిక పాలనా సంస్థలు.

ఇది స్థానిక సంస్థల బాధ్యత. ఇంటి పన్నుతోపాటు డ్రైనేజి సెస్సు, వాటర్ ఛార్జీలు, ఇవికాక చెత్త తొలగింపుకు యూజరుఛార్జీలు. ఇంత వసూలు చేసినా నిధులు లేవన్నదే మాట. స్థానిక సంస్థలకు చెందవలసిన నిధులను బిగబట్టి వాటిని ఎండగడుతున్న వాస్తవాన్ని కప్పి పుచ్చటానికి, పట్టణాలలో మురికి కాల్వల నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధులు కోరామని, త్వరలో సమస్య తీరిపోతుందనీ మంత్రులు సిగ్గుమాలిన ప్రకటనలు గుప్పిస్తారు. ఇలా రూపొందిందే జాతీయ పట్టణ పునరుజ్జీవన కార్యక్రమం. ప్రపంచబ్యాంకు తయారుచేసి యిచ్చిన ఈ కార్యక్రమానికి నెహ్రూ పేరు తగిలించి తమ భుజాలు తామే చరుచుకుంటున్నారు. ఈ పథకం క్రింద వచ్చిన బస్సులు తుక్కయ్యాయిగానీ అవి తిరగడానికి నిర్మించాల్సిన రోడ్లు ఈనాటికీ పూర్తికాలేదు. ప్రపంచబ్యాంకు యిచ్చిన పథకాన్ని కళ్ళకద్దుకోవటమే తప్ప ఎడమ ప్రక్క ట్రాఫిక్ వుండాలన్న నిబంధన వున్నచోట, కుడిప్రక్క ట్రాఫిక్ నడిచే పథకం లోటుపాట్లు ఎవరికీ పట్టలేదు. ఈ పథకానికి ప్రపంచబ్యాంకు ప్రతి వందరూపాయల రుణంలో 80 రూపాయలు బస్సులు, తదితర యంత్రాల రూపంలో, నిర్మాణ కాంట్రాక్టుల రూపంలో సామ్రాజ్యవాద కంపెనీలకు చేరింది. పథకం మాత్రం పూర్తికాలేదు. అప్పు మిగిలింది. అది తీర్చటానికి మున్సిపాల్టీల ఛార్జీలవసూలు పెరిగింది.

ఈ వివరణ తర్వాత బాధ్యతలు పట్టని పాలకుల వైఫల్యం, ప్రజా ప్రయోజనాలు నెరవేర్చని పాలకుల నైజం, దీనితో ఏమీ పట్టని ప్రభుత్వ యంత్రాంగపు ఉదాసీనతలే అపరిశుభ్ర వాతావరణానికి మూలమని అర్ధమౌతుంది.

ఇక వీరికి మిగిలింది రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలే. నెహ్రూ పేరు తగిలించి కాంగ్రెసు లబ్ధిపొందుతుంది గనుక బిజెపికి జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం పథకం పట్టదు. దానికి మరో పథకం కావాలి. దాని కోసం ముందుకు తెచ్చిందే స్మార్ట్ సిటీ నినాదం. త్వరలో దీనదయాళ్ పేరో, వాజ్‌పాయి పేరో తగిలిస్తారు.

మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండీ ఎలాంటి నిర్దిష్ట రూపురేఖలూ, సారాంశములేని ఆర్భాటపు నినాదాలివ్వటం చేస్తున్నాడు. అలా స్మార్ట్ సిటీ నినాదాన్నిచ్చాడు. నగరాలలో విలయతాండవం చేస్తున్న అపరిశుభ్ర వాతావరణంతో విసిగి వేసారిపోయిన మధ్యతరగతి ప్రజలకు ఈ స్మార్ట్ సిటీ నినాదం ఆశలు రేకెత్తిస్తున్నది. స్మార్ట్‌సిటీలుగా ఎంపికైన నగరాలలో పరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని ఆశిస్తున్నారు. వారి ఆశలు అడియాశలుగానే మిగిలిపోతాయి.

స్మార్ట్‌సిటీ అంటే ఎలా వుంటుందో, ఏం చెయ్యబోతారో చెప్పే తీరిక ఎవరికీ లేదు. చెరువులో దున్నను దింపి, దానితో ఎంత పాడి వస్తుందో ఊహించుకునే పని ప్రజలపైనే పెట్టారు. ఇక నగరాల నిర్మాణానికి ప్రణాళికలతోసహా సర్వం విదేశీ కంపెనీలకు కట్టబెట్టే పనిలో జొరబడ్డారు. చంద్రబాబునాయుడి సింగపూర్ జపం దీనిలో భాగమే.

అన్నీ విదేశాల నుండి అరువు తెచ్చుకున్నట్లే, ఈ స్మార్ట్‌సిటీ పదాన్ని కూడా సామ్రాజ్యవాద దేశాల నుండి అరువు తెచ్చుకున్నారు. ఉన్న నగరం జోలికి పోకుండా, ప్రక్కనే మరో నగరాన్ని నిర్మిస్తారు. అక్కడ 24 గంటలూ నీరు, గ్యాసు, విద్యుత్తు నిరాటంకంగా సరఫరా చేస్తారు. ఇంటర్‌నెట్ వంటి సకల సౌకర్యాలూ ఏర్పాటుచేస్తారు. ధనాఢ్య వర్గాలకే అక్కడ ప్రవేశం. వాళ్ళెగిరిపోవటానికి విమానాశ్రయాలూ వస్తాయి. బుల్లెట్ రైళ్ళు పరుగులు పెడతాయి. 24 గంటలూ సిసి కెమెరాలతో ప్రతి అంగుళాన్ని బంధించి ధనాఢ్యులకు ఏ యిబ్బంది కలుగకుండా భద్రతా ఏర్పాటు చేస్తారు. పాతనగరం మాత్రం అలాగే కుళ్ళికంపు కొడుతుంది. స్మార్ట్‌సిటీలో విలాస వ్యయం కోసం, పాతనగరపు కనీస సౌకర్యాలను కుదించివేస్తారు. ఇదీ యూరపులో సాగిన స్మార్ట్‌సిటీల అనుభవం. ఇక భారత్‌లో అమలుజరిగేదిదే. ఇక్కడ అదనంగా స్మార్ట్‌సిటీల కోసం భూములు పోతాయి. దానిపై జీవనం సాగిస్తున్న వర్గాలు ఉపాధిని కోల్పోతాయి.

ఒక మంచి పథకం పట్ల ప్రజల్లో భయాన్ని కలిగించే కువిమర్శ యిదన్న వారికి సమాధానంగా బిజినెస్ స్టాండర్డ్‌లో వచ్చిన వార్తనే చూడండని చెబుతున్నాము. బిజెపి ప్రభుత్వమిచ్చిన స్మార్ట్‌సిటీ నినాదంతో ఏర్పడబోయే వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు కంపెనీలు అతివుత్సాహంతో వున్నాయన్నది ఆ వార్త సారాంశం. స్మార్ట్‌సిటీ నినాదం ఆచరణలోకి వచ్చేసరికి సిద్ధంగా వుండేందుకు ఈ కంపెనీలు పథకాలు వేసుకుంటున్నాయట! ఇప్పటికే ఒక రియల్‌ఎస్టేటు కంపెనీ ముంబాయి దగ్గర లావాసాలో సకల సౌకర్యాలతో ఒక నగరాన్ని నిర్మించింది. అక్కడ ఇంటర్‌నెట్ సర్వీసులు అందించేందుకు, ఇతర సౌకర్యాలు అందించేందుకు అనేక దేశ, విదేశీ కంపెనీలు పరుగులు పెడుతున్నాయని ఆ వార్త వివరించింది. లావాసాలో రెండు పడక గదుల ఫ్లాటు ఖరీదు నాలుగుకోట్ల రూపాయల పైమాటే. ఈ సిటీల నిర్మాణం ఎవరికోసం జరుగుతున్నదో అర్ధం కావటానికిది సరిపోతుంది.

ధనాఢ్య వర్గాల విలాస జీవనానికి దేశ వనరులను వెచ్చించే పథకాలతో మధ్యతరగతి ప్రజలను ఆశల పల్లకీలలో ఊరేగించి ఆమోదముద్ర వేయించుకునే వంచనతో ఇస్తున్న నినాదమే స్మార్ట్‌సిటీ.

ఈ వంచన నుండి ప్రజలదృష్టి మళ్లించడానికే బిజెపి స్వచ్ఛభారత్ నినాదాన్ని యిస్తున్నది. **(తరువాయి 2వ పేజీలో)**

# కార్మిక చట్టాల సవరణలతో మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాయటాన్ని నిరసించండి

## ఏఐఎఫ్‌టియు(న్యూ) పిలుపు

**కష్టజీవుల** ఓట్లతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ ప్రభుత్వం దేశ సంపదలను సృష్టిస్తున్న కార్మికవర్గంపై దాడిచేయటానికి పూనుకుంటోంది. బిజెపి నాయకత్వంలోని రాజస్థాన్ ప్రభుత్వం ఫ్యాక్టరీ చట్టం, అప్రెంటీస్, ట్రేడ్ యూనియన్ల చట్టం, కాంటాక్ట్ లేబర్ ఎబాలిషన్ యాక్ట్, కనీస వేతనచట్టం వంటి కార్మికచట్టాలను తిరోగమన మార్గంలో మార్పులు చేసి రాష్ట్రపతి అనుమతులను పొందింది. రాజస్థాన్ తరహాలో కార్మిక చట్టాలను సవరించడానికి, ప్రస్తుత శీతాకాల సమావేశంలో ఆమోదం పొందడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నది. కార్మిక చట్టాలు – ప్రభుత్వ, యాజమాన్యాల దయాదాక్షిణ్యాలతో వచ్చినవి కావు. కార్మికవర్గం ఉరికంబాలెక్కి, జైళ్ళకు వెళ్ళి, లాఠీల దెబ్బలు తిని, ఉద్యోగాలు కోల్పోయి, అశేష త్యాగాలతో సాధించుకున్నవి. ఈ హక్కులను హరించే విధంగా ఎంఎన్‌సిల, బడా పెట్టుబడిదారుల సూపర్ లాభాల కోసం పాలకులు కార్మికచట్టాల ఈ సవరణలకు పూనుకుంటున్నారు.

**ఫ్యాక్టరీ చట్టం :**

కర్మాగారాల్లో కార్మికుల భద్రత, ప్రాణరక్షణకు, ఆరోగ్యం, సంక్షేమం, కనీస అవసరాలు తీర్చగల స్థితి కల్పించడం గురించి ఫ్యాక్టరీల చట్టాన్ని 1948లో రూపొందించారు. ఈ చట్టం ద్వారా కార్మికుల పనివేళలు, సెలవులు, ఓవర్‌టైమ్, పిల్లలకు, మహిళలకు, యువకులకు ఉద్యోగాలు మొదలైన అంశాల గురించి ఈ చట్టంలో నియమాలు వున్నాయి. 1954లో ఒక సవరణ ద్వారా పిల్లలను, మహిళలను రాత్రిపూట పని చేయకుండా నిషేధించారు. 1987లో ప్రాణాపాయకరమయిన వస్తువులకు సంబంధించిన పరిశ్రమలను నియంత్రించడం కోసం భద్రతా నియమాలు కట్టుదిట్టం చేసారు. విద్యుచ్ఛక్తితో 10 మందితో నిర్వహించే పరిశ్రమకు, విద్యుచ్ఛక్తి సాయం లేకుండా 20 మందితో నడిచే వాటికీ ఈ చట్టం వర్తిస్తుంది. అలాగే పొగాకు ఆరబెట్టి, చుట్ట కట్టలు కట్టడం, సిగరెట్ తయారుచేసిన చోటులో 20 మంది పనిచేస్తే ఈ చట్టం వర్తిస్తుంది. కానీ, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సవరణ పేరుతో 10 మంది పనిచేస్తున్న విద్యుత్ ఉత్పత్తితో ప్రస్తుతం 20 మంది పనిచేయాలనీ, అలాగే విద్యుత్ లేకుండా 20 మంది పనిచేసే చోట 40 మంది పనిచేయాలని మార్చనున్నారు. ఫలితంగా ఎక్కువమంది కార్మికులకు ఈ చట్టం వర్తించకుండా పోతోంది.

**ఓవర్‌టైం :**

ఒక కార్మికుడు రోజూ 9 గంటలకన్నా అధికంగా లేదా వారంలో 48 గంటలకన్న ఎక్కువగా పనిచేస్తే, ఆ సమయానికిగాను, సాధారణ వేతన రేటుకు రెండింతల వేతనం పొందే అధికారం (సెక్షన్ 59) ఉంది. సాధారణ వేతన రేటు అంటే (కనీస వేతనం, ఇతర భత్యాలు) అవసరమైన సందర్భంలో కార్మికునితో 10.30 గంటలు పనిచేయించుకోవచ్చని, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అనుమతితో మాత్రమే 12 గంటలు పనిచేయించవచ్చని ఈ చట్టంలో ఉంది. మూడు నెలల్లో ఒక కార్మికునితో 50 గంటలకు మించి ఓవర్‌టైమ్ చేయించకూడదని ఈ చట్టం చెబుతోంది. చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అనుమతి లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా పెంచవచ్చని చట్టాన్ని సవరించనున్నారు. ఇది కార్మికులను నిర్బంధంగా అదనపు చెల్లింపు లేకుండానే పనిచేయించుకునేందుకు దారితీస్తుంది. మూడు నెలల్లో ఒక కార్మికునితో 100 గంటలు ఓవర్‌టైమ్ చేయించవచ్చనీ, రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో 125 గంటలు చేయించుకోవచ్చనీ చట్టాన్ని సవరించనున్నారు. దీనివల్ల ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది.

**మహిళా కార్మికులు :**

ప్రస్తుతం పిల్లలకూ, మహిళలకు సాయంత్రం 6 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు (రాత్రిపూట) పరిశ్రమలో పనిచేయడాన్ని నిషేధించారు. కానీ, ప్రస్తుతం సవరణల ద్వారా రాత్రి, పగలు అనే బేధం లేకుండా పురుషులతో సమానంగా పరిశ్రమలో పనిచేయాలి.

**అప్రెంటిస్‌షిప్ :**

కార్మికులకు వృత్తిలో నైపుణ్యం పొందడానికి 6 నెలల నుండి 4 సంవత్సరాలవరకు ఉన్న అప్రెంటిషిప్ కాలాన్ని 5 సంవత్సరాలకు పెంచే ప్రతిపాదన చేశారు. అప్రెంటిషిప్‌ను కాంట్రాక్టు ద్వారా పెట్టుకునే అవకాశం కల్పించింది. ఈ మార్పు వస్తే తక్కువ వేతనంతో ఎక్కువ కాలం కార్మికులు దోపిడీకి గురవుతారు.

**కనీస వేతనం :**

కనీస వేతన చట్టం – ధరల పెరుగుదలకు అనుగుణంగా డి.ఏ. చెల్లింపును నిర్దేశించింది. షెడ్యూల్‌లో ప్రకటించిన రంగాలు, వృత్తుల్లో పనిచేసే కార్మికులకు ఇతర షెడ్యూల్‌లో అదే వృత్తిలోని కార్మికుని వేతనం చెల్లించాలి అని ఉంది. ఈ సిఫార్సులతోనూ, సుప్రీంకోర్టు తీర్పుతోనూ సంబంధం లేకుండా ప్రభుత్వం / ప్రభుత్వాలు కనీస వేతనం నిర్ణయించడానికి ఒక ప్రాతిపదిక లేకుండా తమ ఇష్టం వచ్చినట్లు నిర్ణయించే అవకాశాన్ని చట్టసవరణ ద్వారా కల్పించింది. ఐదేళ్ళలోపు కరువు భత్యం (డి.ఏ.) ఇవ్వనవసరం లేకుండా కనీసవేతన చట్టాన్ని సవరించాలని ప్రతిపాదించారు. షెడ్యూల్‌లోని రంగాల్లో పనిచేసే కార్మికులకు అధిక నైపుణ్యం ఉన్నాసరే నైపుణ్యంలేని కార్మికునికిచ్చే కనీస వేతనాన్నే వర్తింపచేయాలని ఈ చట్టంలో సవరణలు ప్రతిపాదించారు.

**ట్రేడ్ యూనియన్ చట్టం (1926) :**

ఒక సంస్థలో ఏడుగురు కార్మికులుంటే చాలు ట్రేడ్ యూనియన్‌ను రిజిష్టర్ చేసుకోవచ్చు. కార్మిక సమస్యలకు ప్రాతినిధ్యం వహించవచ్చు. ఒక ట్రేడ్ యూనియన్ రిజిష్టర్ అవ్వాలంటే ఆ సంస్థలో 30 శాతం కార్మికులు సభ్యులుగా ఉండాలని చట్టాన్ని సవరించనున్నారు.

**(తరువాయి 2వ పేజీలో)**

## స్వచ్ఛభారత్‌ను...(మొదటిపేజీ తరువాయి)

నగరాలనూ, పట్టణాలనూ, పల్లెలనూ పరిశుభ్ర వాతావరణంలో వుంచటానికి స్థానిక పాలనాసంస్థలను పటిష్టపరిచే ఏ నిర్దుష్ట ప్రతిపాదనా లేకుండా స్వచ్ఛ భారత్‌ను ఎలా నిర్మిస్తారు? చేతులతో మలాన్ని తొలగించే వృత్తి నిర్మూలిం చేందుకు ప్రతి యింటికీ మరుగుదొడ్లు నిర్మిస్తామన్న పథకం కాగితాల మీదే మిగిలిపోగా పరిశుభ్రవాతావరణాన్ని ఎలా ఏర్పరుస్తారు? మడత నలగని దుస్తులతో వీపు వంచకుండా చీపుళ్ళతో సుతారంగా తుడిచే ప్రదర్శనలతో పరిశుభ్రత వస్తుందా? దశాబ్దాలుగా ఈ ప్రహసనం సాగుతూనే వుంది. స్వచ్ఛభారత్ కోరుకొనకుండా వుంటున్నది పాలకులే!

ఇంతకన్నా ముఖ్యమైన ప్రశ్న ఒకటుంది. రోడ్లపై చెత్తను ప్రజలే తొలగించాలని పాలకులు బోధిస్తున్నా రనుకున్నా, వాతావరణ కాలుష్యాన్ని తొలగించకుండా స్వచ్ఛభారత్ ఎలా ఏర్పడుతుంది? ఇప్పటికే మోటారు వాహనాలు గాలిని కలుషితం చేస్తుండగా, నగరాలలో ఊపిరితిత్తుల వ్యాధులు గత పదేళ్ళలో ఐదురెట్లు పెరిగాయని గణాంకాలే తెలుపుతుండగా స్వచ్ఛమైన గాలి ఎలా అందుబాటులోకి వస్తుంది? ఇక పారిశ్రామిక కాలుష్యం నదులనూ, సెలయేళ్ళనూ, భూగర్భ జలాలనూ కూడా తాగడానికి కూడా వీలు లేకుండా చేస్తున్నాయి. పర్యావరణ అనుమతులతో విసిగి పోతున్నామంటున్న విదేశీ కంపెనీలకు 'కన్ను మూసి తెరిచేలోపల అన్ని అనుమతులు యిస్తాము, వచ్చి పెట్టుబడులుపెట్టండి. ఇక్కడ తయారుచేసి అమ్ముకోండి' అంటున్న 'మేక్ ఇన్ ఇండియా' విధానాన్ని వెళ్ళిన ప్రతి దేశంలోనూ ప్రచారం సాగిస్తున్న ప్రధానిమోడీ, ఈ పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించబోననే చెబుతున్నాడు. ఇక స్వచ్ఛ భారత్ వంచనాత్మక నినాదంకాక మరేమౌతుంది?

చివరిగా, 70 శాతం ప్రజలు గ్రామాలలో జీవిస్తున్నారు. పేదరికమే పెద్ద కాలుష్యకారకంగా మారిన గ్రామాలలో పేదరికాన్ని తొలగించకుండా స్వచ్ఛ భారత్ ఏర్పడుతుందా? గ్రామాలలో పేద వర్గాలకు విద్య నేర్పే పనిని లాభార్జనా శక్తులకు వదిలివేసిన ప్రభుత్వం, ప్రజల దారిద్ర్యాన్ని తొలగించ గలుగుతుందా? ప్రజల శాస్త్ర విజ్ఞానాన్ని పెంచకుండా స్వచ్ఛ వాతావరణాన్ని తేగలదా? అసాధ్యమన్నదే సమాధానం.

ఈ అసాధ్యాన్నే సాధ్యం చేస్తామంటూ ఆశల పందిళ్ళు వేసి ప్రజలను వంచన చేస్తున్న పాలక వర్గాలు గతం నుండీ అనుసరిస్తున్న విధానాల కొనసాగింపే ఈ స్వచ్ఛ భారత్. ప్రజల జీవనానికి అవసరమైన గాలి, నీరు, ఆహారం, పరిసరాలన్నింటినీ కాలుష్యంతో నింపివేసే దోపిడీవర్గాలకు లాభాలను కట్టబెట్టే తమ విధానాలను ప్రజలు అర్థం చేసుకోకుండా అడ్డు కునేందుకు యిస్తున్న నినాదమే స్వచ్ఛ భారత్! ✡

## కార్మిక చట్టాల...(మొదటిపేజీ తరువాయి)

### కాంట్రాక్టు లేబర్ (ఎబాలిషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం (1970) :

ఐదుగురికి పైబడి ఉన్న కార్మికులకు ఈ చట్టం వర్తిస్తున్నది. సవరణ తర్వాత 50 మందిలోపు కాంట్రాక్టు కార్మికులను నియమించిన యాజమాన్యానికి ఇది వర్తించదు. ఫలితంగా కాంట్రాక్టు కార్మికులు మరింతగా దోపిడీకి గురికాబడతారు.

### పారిశ్రామిక వివాదాల(ఐడి) చట్టం (1947) :

100కి పైన కార్మికులున్న పారిశ్రామిక సంస్థల్లో కార్మికులను రిట్రెంచ్ (తొలగింపు) చేయడానికి ప్రభుత్వ అనుమతి అవసరం. కానీ ఇప్పుడు 300 మంది లోపు కార్మికులున్న సంస్థలు కూడా ప్రభుత్వ అనుమతి లేకుండానే కార్మికులను తొలగించవచ్చని ఐ.డి. చట్టాన్ని సవరించడానికి ప్రతిపాదిస్తున్నారు.

### లేబర్‌లాస్ (రిటర్న్స్, రిజిష్టర్ నిర్వహణ నుంచి కొన్ని పరిశ్రమలకు మినహాయింపు) చట్టసవరణ:

రిజిష్టర్లు, రిటర్న్‌లు మెయింటెయిన్ చేయనవసరం లేకుండా యజమానులకు మినహాయింపు ఇవ్వాలని చట్ట సవరణలో ప్రతిపాదించారు.

పారిశ్రామిక వివాద చట్టంలో మార్పుల ద్వారా ఇష్టం వచ్చినట్లు కార్మికులను తొలగించడానికి (హైర్ & ఫైర్), యథేచ్ఛగా లాకౌట్‌లు, మూసివేతలకు పాల్పడడానికీ కంపెనీలకు అనుమతిచ్చేందుకు పూనుకున్నారు. ఫ్యాక్టరీ యాక్టు సవరణల ద్వారా ప్రస్తుతం దేశంలో 30 మంది కార్మికులు పనిచేస్తున్న 3 లక్షల చిన్న పరిశ్రమలకు ఫ్యాక్టరీ యాక్టుకు సంబంధం లేకుండా పోతోంది. ఫలితంగా సుమారు 90 లక్షల మంది కార్మికులకు ఓవర్‌టైమ్, జాతీయ పండుగ సెలవులు, ఆర్జిత సెలవులు లేకుండా పోతాయి. రిజిష్టర్లు, రిటర్న్‌ల సవరణ ద్వారా 72 శాతం ఫ్యాక్టరీ యజమానులు తమకిష్టం వచ్చినట్లు చట్టాలను ఉల్లంఘించి కార్మికులపై దోపిడిని మరింత తీవ్రం చేసే పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే అప్రెంటిషిప్ సవరణ ద్వారా కార్మికులకు తక్కువ జీతాలు ఇచ్చి కాంట్రాక్టర్లు దోచుకోవడానికి అవకాశం దొరుకుతుంది.

మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల సూపర్ లాభాల కోసం కార్మిక చట్టాలకు ఈ సవరణలు చేస్తోందని ఋజువవుతున్నది. నూతన ఆర్థిక విధానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ కూటమి వదిలిన చెప్పుల్లో కాళ్ళు దూర్చి మోడీ ప్రభుత్వం దూకుడుగా ముందుకు వెళ్తున్నది. ఇన్సూరెన్స్, రిటైల్, రక్షణరంగాల్లో ఉన్న పరిమితులను ఎత్తివేసి విదేశీ పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచింది. రైల్వేలలో, స్థిరాస్తి (రియల్‌ఎస్టేట్), బ్యాంకు రంగాల్లో విదేశీపెట్టుబడులకు ద్వారాలు తెరిచారు. అడ్డగోలుగా కార్మికుల శ్రమశక్తిని దోచుకొనేందుకు వీలుగా కార్మికచట్టాలను సమూలంగా మార్చేందుకు పూనుకున్నారు. కార్మికులను మధ్య యుగాల కాలంనాటి బానిసలుగా మార్చుకొని శ్రమను దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

**కావున పోరాట చరిత్ర, పోరాటాల వారసత్వం కల్గిన కార్మికవర్గం పాలకులు చేస్తున్న ఈ దాడికి వ్యతిరేకంగా వర్గదృక్పథంతో సమైక్యంగా ఉద్యమించాలి. కులం, మతం, ప్రాంతం, భాషా బేధాలను ప్రక్కనబెట్టి, వివిధ సంఘాల పతాకాలు, బ్యానరు సెంటిమెంట్లను అధిగమించి కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలని ఏఐఎఫ్‌టియు(న్యూ) విజ్ఞప్తి చేస్తున్నది.**

**26-11-14**

**ఏ ఐ ఎఫ్ టి యు(న్యూ)**

| | |
|---|---|
| **రాష్ట్ర కార్యవర్గం** | **రాష్ట్ర కార్యవర్గం** |
| **ఆంధ్రప్రదేశ్** | **తెలంగాణ** |

## లెనిన్‌కు అత్యంత విశ్వసనీయ...(3వపేజీ నుండి)

అక్టోబర్ 24వ తేదీ ఉదయం, పార్టీ కేంద్రకమిటీ పత్రికను బయటకురాకుండా అడ్డుకునేందుకు కెరెన్స్కీ ప్రభుత్వం అణచివేతకు ఆదేశాలు జారీచేసింది. అయితే ఎర్రసైనికుల బృందం మరియు విప్లవ సైనికులు స్టాలిన్ ఆదేశాలపై రక్షణవలయంగా ఏర్పడి ముద్రణాలయాన్ని, సంపాదక కార్యాలయాలను కాపుగాచారు. సరిగ్గా 11 గంటలకు 'మనకిప్పుడు ఏది అవసరం?' అనే పేరుతో స్టాలిన్ రాసిన వ్యాసం ముద్రించబడిన పత్రికతో రొబోచిపుత్ బయటకొచ్చాడు. ఆ వ్యాసంలో బూర్జువా తాత్కాలిక ప్రభుత్వాన్ని కూలదోయమని స్టాలిన్ ప్రజలకు పిలుపునిచ్చాడు. అదే సమయంలో, పార్టీ కేంద్ర ఆదేశానుసారం, విప్లవ సైనికులు, ఎర్రసైన్యం స్మోల్నీ ఇన్‌స్టిట్యూట్‌కు చేరుకున్నారు. అక్టోబరు 24న తిరుగుబాటు ప్రారంభమైంది. అక్టోబర్ 25 సాయంత్రం (నవంబర్ 7) సోవియట్ల 2వ మహాసభ సమావేశమై ప్రభుత్వాధికారాన్ని సోవియట్లకు బదలాయించింది.

మహత్తర సోషలిస్టు విప్లవం, ఈ భూమండలాన్ని పెట్టుబడిదారీ విధానం – సోషలిస్టు విధానమనే రెండు వ్యవస్థలుగా విభజించింది. ఇప్పుడు బోల్షివిక్‌పార్టీ నూతన బృహత్తర కర్తవ్యాలతోకూడిన నూతన పరిస్థితిని ఎదుర్కొంది.

లెనిన్ – ఛైర్మన్‌గానున్న మొట్టమొదటి 'ప్రజా కమిస్సార్ల మండలి'లో స్టాలిన్ ఒక సభ్యుడిగా వున్నాడు. సోవియట్ ప్రభుత్వ స్థాపన నాటి నుండి 1923 వరకూ జాతుల అంశంపై ప్రజాకమిస్సార్‌గా స్టాలిన్ బాధ్యతలు నిర్వహించాడు. యుఎస్ఎస్ఆర్‌లో జాతుల సమస్యను పరిష్కరించటంలో స్టాలిన్ అత్యంత ప్రధానపాత్ర పోషించాడు. లెనిన్, స్టాలిన్‌లు సోవియట్ రిపబ్లిక్కుల ఏకీకరణకు ప్రధానంగా కృషి సాగించారు.

స్టాలిన్, స్వెర్దలోవ్‌లు సోవియట్ ప్రభుత్వంలో లెనిన్‌కు అత్యంత సన్నిహిత సహాయకులుగా వుండేవారు. కామెనోవ్, జినోవెవ్, రైకోవ్‌ల తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో స్టాలిన్ ఎల్లవేళలా లెనిన్ పక్షానే నిలిచాడు.

సోవియట్లు అధికారం పొందిన తర్వాత, రష్యన్ భూస్వాములు, పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాద దేశాలతో కలసి వారి సైనికజోక్యం ద్వారా సోవియట్ ప్రభుత్వాల్ని కూల్చివేయటానికి కుట్రలు పన్నటం ప్రారంభించారు. ఈ కుట్రల ఫలితంగా అంతర్యుద్ధాలు, సైనిక జోక్యాలు ప్రారంభమయ్యాయి. ఈ కుట్రల నుండి సోవియట్ భూమిని రక్షించుకునేందుకు పోరాటం సాగించాలని లెనిన్ ప్రజలకు పిలుపునిచ్చాడు. పరిస్థితి చాలా విషమమైనది. సామ్రాజ్యవాద యుద్ధ కోరల నుండి దేశం ఇప్పుడిప్పుడే బయటపడి వుంది. పెట్టుబడిదారుల, భూస్వాముల దోపిడీ పాలన ఫలితంగా ప్రజలు విధ్వంసపు అంచున వున్నారు.

తిరుగుబాటుపై సైనికులకు వ్యతిరేకంగా ప్రతిఘటనను నిర్మించేందుకు కేంద్రకమిటీ స్టాలిన్‌ను ఎంపిక చేసింది. అంతర్యుద్ధ సమయంలో కేంద్రకమిటీ గాను, లెనిన్ వ్యక్తిగతంగానూ విప్లవ ఫలితాలకు అత్యధిక ముప్పు వున్న కీలక ప్రాంతాలకు, రంగాలకు స్టాలిన్‌ను పంపేవారు. అంతర్యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు స్టాలిన్ రూపొందించిన పథకాన్ని కేంద్రకమిటీ ఆమోదించింది. విజయం సాధించేందుకు స్టాలిన్ కఠోర శ్రమ చేశాడు. సైనికచర్యల వెన్నంటి వుండటం, వాటిలో తలెత్తే సమస్యలనుపరిష్కరించటం, తగిన కమాండర్లను, రాజకీయ కార్యకర్తలను ఎంచుకోవడం, తన స్వీయ పోరాట స్ఫూర్తిని వారిలో నింపటం వంటి పద్ధతుల్లో స్టాలిన్ రూపొందించిన పథకం ప్రకారం సోవియట్ వ్యతిరేక తిరుగుబాటు సైన్యం సంపూర్తిగా పెకిలించి వేయబడ్డారు. స్టాలిన్ చొరవతో ఓరోషిలోవ్, షెహడెన్‌కోలు కమాండర్లుగా విఖ్యాతిగాంచిన 'ఫస్ట్‌మౌంటెడ్ ఆర్మీ' ఏర్పడింది.

అంతర్యుద్ధకాలంలో లెనిన్, స్టాలిన్‌లు అత్యంత సన్నిహిత సంబంధాలలో వుండి కృషిసాగించారు. ధృడమైన ఎర్రసైన్య నిర్మాణానికి వారు చేయి చేయి కలిపి వ్యవహరించారు. అంతర్యుద్ధ కాలంలో స్టాలిన్ సాగించిన కృషి ప్రత్యేక గుర్తింపు పొందింది. 1919 నవంబర్ 27న జరిగిన అఖిల రష్యన్ కేంద్ర కార్యనిర్వాహక కమిటి సమావేశంలో స్టాలిన్‌కు 'ఆర్డర్ ఆఫ్ రెడ్ బ్యానర్'ను బహూకరిస్తూ లెనిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అత్యధిక ప్రాధాన్యత గల వ్యూహాత్మక పథకాలను రూపొందించి, అవి నిర్ణయాత్మకమైన సైనికచర్యల రూపం తీసుకోవటానికి స్టాలిన్ మార్గదర్శకత్వం వహించాడు. జారిట్సిన్, పెర్మ్‌లలో; పెట్రోగ్రాడ్, డెనికిన్‌లలో; పశ్చిమ, దక్షిణ ప్రాంతాలలో – ప్రతిచోటా స్టాలిన్ ధృడ సంకల్పం, వ్యూహాత్మక మేథోచతురతలు విప్లవ విజయాన్ని గ్యారంటీ చేశాయి. స్టాలిన్ లేని ఎర్రసైన్యాన్ని ఊహించ లేమని లెనిన్ స్వయంగా పేర్కొన్నాడు. ఎర్రసైన్యపు అత్యంత విఖ్యాత విజయాలు స్టాలిన్‌తో ముడిపడి వున్నాయి.

అంతర్యుద్ధం ముగిసిన తర్వాత, సోవియట్ యూనియన్ శాంతియుత ఆర్థికాభివృద్ధి కృషి వైపు దృష్టి సారించింది. నాలుగు సంవత్సరాల సామ్రాజ్యవాద యుద్ధం దేశాన్ని పతనావస్థకు చేర్చింది. ఆకలి, పేదరికం, కరువు కాటకాలతో కార్మికుల, రైతాంగపు అసంతృప్తి గొంతుక వినిపించటం ప్రారంభమైంది. దేశంలోని ఆర్థిక అసంతృప్తులను వర్గశత్రువులు తమ ప్రయోజనాలకనుగుణంగా మళ్ళించుకునేందుకు ప్రయత్నించారు. సోవియట్ ప్రభుత్వం తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంది.

లెనిన్ నాయకత్వంలోని కేంద్రకమిటి ఒక నూతన ఆర్థికవిధానాన్ని రూపొందించుకోవాల్సిన అవసరంపై సంఘర్షణపడింది. కానీ, పార్టీలోని లెనిన్ వ్యతిరేకవర్గీయులు నూతన విధానాలు రూపొందించు కోవటానికి అడ్డుపడే ప్రయత్నాలు చేశారు. 1920 చివరినాటికి 'ట్రేడ్ యూనియన్స్ పై చర్చ'గా పిలువబడేదాన్ని ముందుకు తెచ్చి, పార్టీ వ్యతిరేక బృందాలు ఓ వివాదాన్ని రుద్దాయి. ఈ పరిస్థితులలో విప్లవం మరింత విజయవంతంగా పురోగమించటంలో పొంచివున్న మౌలిక సమస్యలను గురించి చర్చించేందుకు 1921 మార్చిలో పార్టీ పదవ మహాసభ జరిగింది. ఈ మహాసభ ట్రేడ్ యూనియన్లపై జరిగిన చర్చను లెనిన్ వైఖరికనుగుణంగా మదింపు చేసి, ముగింపు పలికింది. లెనిన్ రచించిన 'నూతన ఆర్థిక విధానాన్ని' పార్టీ మహాసభ ఆమోదించింది. సోషలిజం నిర్మాణంలో కార్మిక, కర్షకవర్గాల ధృడమైన ఐక్యతకు ఈ విధానం గట్టి హామీనిచ్చింది. కానీ, కామెనోవ్, బుఖారిన్ తదితరుల నాయకత్వంలోని పార్టీ వ్యతిరేక బృందాలు నూతన ఆర్థిక విధానాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేశాయి. నూతన ఆర్థిక విధానం ఒక సంవత్సరకాలం అమలైన తర్వాత పార్టీ 11వ మహాసభకు పిలుపునిచ్చారు. 11వ పార్టీ మహాసభలో లెనిన్ రూపొందించిన చారిత్రాత్మక కర్తవ్యాలను ముందుకు తీసుకెళ్ళవలసిన పరిస్థితి వుంది. లెనిన్ ప్రతిపాదన మేరకు, 1922 ఏప్రిల్‌లో జరిగిన కేంద్ర కమిటి ప్లీనమ్‌లో లెనిన్ యొక్క అత్యంత విశ్వసనీయ సహచరుడైన స్టాలిన్‌ను కేంద్రకమిటి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. పార్టీ వ్యతిరేకశక్తులకు ఇది ఒక పెద్ద దెబ్బగా తాకింది.

లెనిన్ యొక్క జాతుల విధానానికి స్టాలిన్ ఏర్పరచిన యుఎస్ఎస్ఆర్ ఓ పెద్ద విజయం.

1923లో జరిగిన పార్టీ 12వ మహాసభకు అనారోగ్యకారణంగా లెనిన్ హాజరుకాలేకపోయాడు. లెనిన్ చేసిన ప్రతిపాదనలన్నీ ఈ మహాసభలో నిర్ణయాలుగా ఆమోదం పొందాయి. నూతన ఆర్థిక విధానాన్ని సోషలిస్టు సూత్రాల నుండి తిరోగమనంగా వ్యాఖ్యానించే వారి వాదనలను పార్టీ మహాసభ తోసిపుచ్చింది. ట్రాట్స్కీవాదులు, బుఖారినైట్ల ద్రోహపూరితమైన ప్రతిపాదనలను ఖండించి తిరస్కరించింది.

పార్టీ 12వ మహాసభ తర్వాత, సోవియట్ యూనియన్ మరో సమస్యను ఎదుర్కొంది. బ్రిటన్ మరియు ఫ్రాన్స్ దేశాలలో అధికారంలోకి వచ్చిన ప్రతీఘాతుక శక్తులు, సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్‌పై కత్తిగట్టి మరో 'పవిత్ర యుద్ధాని'కి సన్నాహాలలో వున్నారు. అయితే, స్టాలిన్ నేతృత్వంలో దౌత్యవేదికలపై ఒప్పందాలతో పార్టీ ఈ విషమ పరిస్థితిని అధిగమించింది. 1924నాటికి యూరపులోని అతిపెద్ద పెట్టుబడిదారీ దేశాలన్నీ బెదిరింపులు, హెచ్చరికలతో కూడిన వారి బాణీని మార్చుకొని యుఎస్ఎస్ఆర్‌ను గుర్తించసాగాయి. 1924 జనవరి 21న పార్టీ 13వ మహాసభ జరిగింది. ట్రాట్స్కీవాదులు మహాసభ నుండి తీవ్ర విమర్శలనెదుర్కొన్నారు.

1924 జనవరి 21న బోల్షివిక్ పార్టీ నాయకుడు, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, అంతర్జాతీయ కార్మికవర్గ మహానేత లెనిన్ అమరుడయ్యాడు.

బోల్షివిక్‌పార్టీ ఉత్తమోత్తమ పుత్రుడు లెనిన్ విశిష్ట సంపద్వంత వారసుడు అయిన స్టాలిన్ – లెనిన్ పతాకాన్ని, పార్టీ పతాకాన్ని అందుకొని ముందుకు సాగిపోయాడు. ✡

## నేనే జనావళిని! 'అల్లరిమూక'ని–ప్రజారాశిని!

- కార్ల్ సాండ్‌బర్గ్

నేనే జనావళిని... ప్రజారాశిని....
సాధారణ ప్రజాసమూహాన్ని!
ప్రపంచంలో మహత్తరమైన కృషి నేనే చేసినట్లు
నీకు తెలుసా?
నేను శ్రామికుణ్ణి! సృష్టికర్తను!
ప్రపంచానికి తిండినీ, దుస్తులనూ
తయారుచేసేవాడిని!
చరిత్రకు సాక్షిగా వున్న ప్రేక్షకుణ్ణి!
నాలోంచే నెపోలియన్లు, లింకన్లు ఉద్భవిస్తారు
వారు మరణించిన తర్వాత
మరెందరో నెపోలియన్లు, లింకన్లు
మాలోంచే వస్తారు!
నేను విత్తనం నాటడానికి సిద్ధంగా వున్న క్షేత్రాన్ని!
ఎంతో దున్నాల్సిన పచ్చిక బయలును నేను
తట్టుకుంటాను భయంకరమైన తుపాన్లను
ఆ తర్వాత వాటిని మరచిపోతాను
నా పనిని మృత్యువొక్కటే ఆపుతుంది
నేను మరచిపోతాను
కొన్నిసార్లు నేను ఆగ్రహంతో గుర్రుమంటాను
చరిత్ర గుర్తుంచుకొనేలా వళ్ళు విదిలించుకొని
రక్తాన్ని కక్కుతాను
ఆ తర్వాత మరచిపోతాను
కానీ, నేను... అంటే జనావళిని
నిన్నటి గుణపాఠాల సాయంతో
గతంలో నన్ను కొల్లగొట్టిన వాడిని
నన్ను తెలివితక్కువ దద్దమ్మచేసి ఆడుకున్నవాడిని
జ్ఞాపకం వుంచుకుంటే...
'ఆ జనం' అంటూ హేళనగా నవ్వేవారూ,
ఎగతాళి చేసేవారూ ఎవరూ వుండరు
అప్పుడు వస్తారు రంగంలోకి "అల్లరిమూక",
'ప్రజలగుంపు'–అదే జనావళి!

ఆంగ్లం నుండి అనువాదం : **కెఆర్‌బి**

**కార్ల్ సాండ్ బర్గ్ (1878-1967) :** అమెరికన్ కవి, రచయిత, జానపద సంగీతకారుడు. పాఠశాల విద్య తరువాత బూట్ పాలిష్ చేయడం, పాల ప్యాకెట్లు, పత్రికలు ఇంటింటికీ ఇవ్వడం వంటి పలురకాల పనులు చేశాడు. స్పానిష్ – అమెరికన్ యుద్ధంలో స్వచ్ఛంద సేవకునిగా సైన్యంలో పనిచేశాడు. ఆ తరువాత సోషల్ డెమోక్రటిక్ పార్టీ కార్యకర్తగా పనిచేశాడు. శ్రామికుల, వారి పిల్లల దుర్భర జీవన స్థితిగతులపై వారి అనంతమైన సమస్యలపై కవితలు రాశాడు.

# లెనిన్‌కు అత్యంత విశ్వసనీయ సహచరుడు - స్టాలిన్

సుబోధ్‌మిత్ర

**పారిశ్రామిక** పెట్టుబడిదారీ విధానం, కార్మికవర్గ ఉద్యమ అభివృద్ధితో రష్యా వ్యాపితంగా మార్క్సిజం వ్యాప్తి చెందటం ప్రారంభమైన కాలంలో జోసెఫ్ స్టాలిన్ (జుగాష్‌విలి) విప్లవోద్యమంలోకి ప్రవేశించాడు. నాటి ట్రాన్స్‌కకేసియాలోని కొన్ని అజ్ఞాత మార్క్సిస్టు బృందాలతో తన 15వ ఏట స్టాలిన్ సంబంధాలలోకి వచ్చాడు. 1898లో, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ (ఆర్ఎస్‌డిఎల్‌పి) అనుబంధ టిఫ్లిస్ సంస్థలో ఆయన తన పేరును నమోదు చేసుకున్నాడు. ఈ సంస్థ రాజకీయంగా ఒకే రకపు అభిప్రాయాలు కలిగిన సంస్థకాదు. ఈ సంస్థలో అత్యధిక సంఖ్యలో సభ్యులు "చట్టబద్ధమార్క్సిస్టు"ల అవగాహనలతో ఏకీభావం కలిగి వుండి, బూర్జువా జాతీయవాదం వైపు మొగ్గు చూపేవారు.

విప్లవ ప్రజాతంత్ర ఉద్యమ వెల్లువకు కేంద్రమైన జార్జియాలోని మెసామేదసేలో కెట్స్‌కోవెలి, సులుకైడ్ లతో కలసి సంస్థలో మైనారిటీగా వున్న స్టాలిన్ విప్లవ మార్క్సిస్టులకు నాయకత్వం వహించే కేంద్రంగా ఏర్పడ్డారు.

అనతి కాలంలోనే స్టాలిన్ టిఫ్లిస్ సోషల్ డెమోక్రటిక్ సంస్థలో అత్యంత చురుకైన నాయకుడిగా ముందుకొచ్చాడు. 1898–1900 కాలంలో టిఫ్లిస్ సంస్థకు చెందిన ఒక కేంద్ర సోషల్ డెమోక్రటిక్ నాయకత్వ బృందం ముందుకొచ్చి స్టాలిన్ నాయకత్వంలో ఒక రూపం తీసుకుంది. చట్టాతీత సోషల్ డెమోక్రటిక్ పార్టీ సంస్థ ఏర్పాటుకు ఈ బృందం, విశేషమైన విప్లవ ప్రచార, విప్లవ సంస్థాగత నిర్మాణ కృషిని సాగించింది. ఈ బృందం, కార్మికవర్గ విమోచనకు లెనిన్ సారథ్యంలోని 'లీగ్ ఆఫ్ స్ట్రగుల్' నమూనాను అనుసరించింది.

1900 డిసెంబర్‌లో, ఎప్పుడైతే లెనిన్ సారథ్యంలో ఇస్క్రా వెలువడటం ప్రారంభమైందో, స్టాలిన్ సంపూర్ణంగా ఆ విధానాలను స్వీకరించి లెనిన్ పంథానే తన పంథాగా చేసుకున్నాడు.

ఈ పంథా నుండి అతను ఏనాడూ వెనుదిరగలేదు. లెనిన్ మరణానంతరం స్టాలిన్ ఈ పంథాను పరిపూర్ణ విశ్వాసంతో, ధైర్యంగా ముందుకు తీసుకువెళ్ళాడు.

స్టాలిన్ నాయకత్వంలో ట్రాన్స్‌కకేసియా కార్మిక వర్గం యొక్క విప్లవ పోరాటాల అభివృద్ధితో జారు ప్రభుత్వం అప్రమత్తమైంది. చివరకు, 1901 మార్చి 12న స్టాలిన్ అరెస్టుకై పోలీసులు వారెంట్ జారీచేశారు. వెనువెంటనే స్టాలిన్ అజ్ఞాతంలోకి వెళ్ళాడు. ఈ క్షణం నుండి 1917 ఫిబ్రవరి విప్లవం వరకూ వీరోచిత సాహసాలతో, నిరుత్సాహం దరిచేరనీయని తీరులో లెనిన్ ఒరవడిలో వృత్తి విప్లవకారుడిగా స్టాలిన్ నిర్బంధాలకు గురవుతూ, అజ్ఞాతవాస జీవితం గడుపుతూ వచ్చాడు.

బలమైన ప్రజా ఉద్యమ నాయకుడైన స్టాలిన్ కోసం వెతుకులాటలో పోలీసులున్నారు. 1902 ఏప్రిల్ 5న పోలీసులు స్టాలిన్‌ను అరెస్టుచేసి, క్రూరత్వానికి పేరుగాంచిన కుటాయిస్‌లోని జైలుకు తరలించారు. జైలులో ఆయన పార్టీ రెండవ కాంగ్రెస్‌కు హాజరైన ప్రతినిధులను కలుసుకొని, వారి ద్వారా బోల్షివిక్కులకు, మెన్షివిక్కులకు మధ్య సాగుతున్న భీకర సంఘర్షణ గురించి తెలుసుకున్నాడు. స్టాలిన్ బోల్షివిక్కుల పక్షం వహించాడు. స్టాలిన్ సైబీరియా ప్రవాసంలోనున్న కాలంలో లెనిన్ నుండి ఓ లేఖను అందుకున్నాడు.

లెనిన్ రాసిన ఆ లేఖ స్టాలిన్‌పై అమితమైన ప్రభావం చూపింది. లెనిన్ ఉత్తరం అందుకున్న తర్వాత, తిరిగి వెళ్ళి లెనిన్ పథక రచనలో బోల్షివిక్ పార్టీని నిర్మించేందుకు తహతహలాడాడు. 1904 జనవరి 5న, స్టాలిన్ ప్రవాసం నుండి తప్పించుకొని కకాసస్‌లో ప్రత్యక్షమయ్యాడు.

లెనిన్ యొక్క విశ్వసనీయమైన శిష్యుడు, సహచరుడైన స్టాలిన్ కకాసస్‌లో మెన్షివిక్కులను ఓడించే సిద్ధాంత పోరాటం జరపటంలో, మార్క్సిస్టు ప్రాథమిక సిద్ధాంత, నిర్మాణ, ఎత్తుగడల పరిరక్షణలో అద్భుతమైన పాత్ర నిర్వహించాడు.

ఈ కాలంలోని అతని రచనలు నిలకడగా లెనిన్ దృక్పథాన్ని ప్రబోధించటంలో నమూనాలుగా వున్నాయి. ఈ కాలంలో స్టాలిన్ రచించిన 'పార్టీలో విభేధాలపై క్లుప్తంగా', 'కుటాయిస్ నుండి లేఖలు', 'సోషల్ డెమోక్రట్‌లకు ప్రత్యుత్తరం' వంటి పేర్కొనదగిన రచనలన్నీ మార్క్సిస్టు సిద్ధాంతమౌలికసూత్రాల సమర్ధనలతో కూడి వున్నాయి. దృఢమైన ప్రజా పునాదిని నిర్మించటంలోనూ స్టాలిన్ ఓ విశిష్టమైన పాత్ర నిర్వహించాడు.

నియంతృత్వాన్ని కూలద్రోసేందుకు, గణతంత్రాన్ని స్థాపించేందుకు సాయుధ తిరుగుబాటు సాగించాలన్న లెనిన్ ఆలోచనను స్టాలిన్ ఉత్సాహంగా సమర్ధించాడు. 1905–07 కాలంనాటి స్టాలిన్ రచనలలో 'సాయుధ తిరుగుబాటు' యొక్క ఆవశ్యకతను గురించి ఆయన వివరంగా చర్చించాడు.

ఈ కాలంలో ట్రాన్స్‌కకేసియాలో కార్యక్రమాలలో స్టాలిన్ నిండా మునిగివున్నాడు. స్టాలిన్ నేతృత్వంలో ఆర్ఎస్‌డిఎల్‌పి కకేసియా యూనియన్ యొక్క బోల్షివిక్ నాల్గవ మహాసభ – సాయుధ తిరుగుబాటును ముందుకు సాగించేందుకు అవసరమైన పోరాటాన్ని తీవ్రతరం చేయాలని, జార్ 'డ్యూమా'ను బహిష్కరించాలని, కార్మిక – రైతాంగ విప్లవ సంస్థలైన కార్మికుల ప్రతినిధులతో కూడిన సోవియట్లను, సమ్మె కమిటీలను, విప్లవ కమిటీలను సంఘటితం, విస్తృతం జేయాలని తీర్మానాలు చేసింది. విప్లవానికి, సాయుధ తిరుగుబాటుకు వ్యతిరేకులుగా మెన్షివిక్కులను ఆయన వెల్లడిచేసి తీవ్రంగా ఖండించాడు. నియంతృత్వానికి వ్యతిరేకంగా నిర్ణయాత్మకమైన పోరాటం సాగించేందుకు కార్మికులను సన్నద్ధం చేయటానికి ఆయన నిరంతరాయంగా శ్రమించాడు. ట్రాన్స్ కకేసియా వ్యాపితంగా విప్లవ జ్వాలలు వ్యాపించాయి. 'మన పార్టీలో అత్యంత సమరశీల మైనదిగా' ఈ సంస్థను, ఉద్యమాన్ని ఉద్దేశించి లెనిన్ వ్యాఖ్యానించాడు.

1905 డిసెంబర్‌లో మొదటి 'ఆల్ రష్యన్ బోల్షివిక్ మహాసభకు' హాజరయ్యేందుకు ఫిన్‌లాండ్‌లోని టామర్‌ఫోర్స్‌కు స్టాలిన్ వెళ్ళాడు. అక్కడే మొదటిసారిగా లెనిన్, స్టాలిన్‌లు ప్రత్యక్షంగా కలుసుకున్నారు. మహాసభ రాజకీయ ముసాయిదా కమిటీలో స్టాలిన్, లెనిన్‌తో కలసి పనిచేశాడు. స్టాలిన్ పార్టీలో ఓ ప్రముఖ నాయకునిగా ఎన్నుకోబడ్డాడు.

విప్లవోద్యమ వెల్లువ క్రమంగా వెనుకపట్టుకు గురైన తర్వాత జరిగిన ఆర్ఎస్‌డిఎల్‌పి నాల్గవ మహాసభ సన్నాహకాలతో బోల్షివిక్కులకు, మెన్షివిక్కులకు నడుమ విభేధం సరికొత్తగా మరోసారి ముందుకొచ్చింది. 1906లో జరిగిన ఆర్ఎస్‌డిఎల్‌పి నాల్గవ మహాసభలో స్టాలిన్ చురుకైన పాత్ర నిర్వహించటంతోపాటు, మెన్షివిక్కులకు వ్యతిరేకంగా పోరాటంలో లెనిన్ పంథాను ఆయన ఎత్తిపట్టాడు.

మహాసభ అనంతరం, స్టాలిన్ ట్రాన్స్ కకేసియాకు తిరిగివచ్చి, కార్మికవర్గ వ్యతిరేక ధోరణులకు వ్యతిరేకంగా తన పోరాటాన్ని కొనసాగించాడు. ఇదే సమయంలోనే స్టాలిన్ 'అరాచకవాదమా, సోషలిజమా?' అనే పేరున అమోఘమైన అనేక వ్యాసాలను రాశాడు. ఈ వ్యాసాలలో మార్క్సిస్టు సిద్ధాంత మౌలికాంశాలైన గతితార్కిక, చారిత్రక భౌతికవాదాలను ఎత్తిపట్టడంతో పాటు, వాటిని సుసంపన్నంగావించాడు.

మెన్షివిక్కులపై బోల్షివిక్కుల విజయాన్ని ఖాయం చేసిన, 1907లో లండన్‌లో జరిగిన ఆర్ఎస్‌డిఎల్‌పి 5వ మహాసభ నిర్వహణా కృషిలో స్టాలిన్ చురుకైన పాత్ర నిర్వహించాడు.

రష్యా మొదటివిప్లవం ఒక ఓటమితో ముగిసింది. మొదటి – రెండవ విప్లవాల నడుమ పది సంవత్సరాల కాలంలో ప్రజలను సంఘటితపరచటంలో, వారిలో విప్లవోత్తేజాన్ని నింపటంలో, వారి పోరాటాలకు మార్గ నిర్దేశంచేయటంలో మరియు అంతిమ విజయానికి భూమికను తయారుచేయటంలో, బోల్షివిక్కులు వీరోచితమైన, స్వీయత్యాగాలతో పట్టుదలగా, అవిశ్రాంతంగా కృషిచేశారు. 1902–1913 మధ్యకాలంలోని ఈ కృషిలో స్టాలిన్‌ను పోలీసులు 7 సార్లు అరెస్టుచేశారు. ఆరుసార్లు ప్రవాస శిక్షలు విధించారు. కాగా, ఐదుసార్లు ఆయన ప్రవాస శిక్ష నుండి తప్పించుకున్నాడు. స్టాలిన్ చివరి ప్రవాసమైన తురుఖాన్స్క్‌లో మాత్రమే పూర్తికాలం శిక్షను పూర్తిచేసి, 1917 ఫిబ్రవరి విప్లవం తర్వాత విడుదల చేయబడ్డాడు.

పార్టీ 5వ మహాసభ నుండి తిరిగి వచ్చిన తర్వాత స్టాలిన్ 'బాకు' ప్రాంతంలో పార్టీ కృషిని ప్రారంభించాడు. పార్టీ ఆదేశానుసారం బాకూలో కార్మికవర్గాన్ని సంఘటితపరిచే పనిలో నిమగ్నమయ్యాడు. స్టాలిన్ జీవితం, ఆయన కృషిల విషయంలో బాకూలో పని చేసినకాలం అధిక ప్రాధాన్యం కలిగింది. పురోగామి కార్మికుల నడుమ మూడు సంవత్సరాల కాలం సాగించిన విప్లవ కార్యకలాపాలు ఆచరణాత్మక యోధునిగా ఆయనను రాటుదేల్చాయి. 1908 మార్చి 25న స్టాలిన్ తిరిగి మరోసారి అరెస్టు అయ్యాడు. 1909 జూన్ 24న ఆయన తిరిగి ప్రవాసశిక్ష నుండి తప్పించుకొని బాకూలోని కార్మికుల నడుమ అజ్ఞాత కృషిలో నిమగ్నమయ్యాడు.

సైంట్‌పీటర్స్‌బర్గ్‌లో కార్మికులను సంఘటిత పరిచేందుకు పార్టీ స్టాలిన్‌ను అక్కడకు పంపింది. 1911 సెప్టెంబర్ 9న స్టాలిన్ మరోసారి అరెస్టయ్యాడు. తిరిగి మరోసారి 1912 ఫిబ్రవరిలో స్టాలిన్ ప్రవాసాన్నుండి తప్పించుకొని ప్రజల మధ్యకు చేరాడు.

1912 జనవరిలో పార్టీ జీవితంలో ఓ ప్రాముఖ్యం గల సంఘటన చోటు చేసుకుంది. ఆర్ఎస్‌ఓఎల్‌పి ప్రేగ్ మహాసభ మెన్షివిక్కులను పార్టీ నుండి బహిష్కరించిన తర్వాత లెనినిజంతో నిర్మితమయ్యే నూతన తరహా బోల్షివిక్ పార్టీని ప్రారంభించింది. అన్ని పార్శ్వాలలోని 'ఆర్థికవాదులకు' 'మెన్షివిక్కులకు' 'ట్రాట్స్కీయిస్టులకు' 'ఓట్జోవిస్టలకు' 'ఆదర్శవాదులకు' వ్యతిరేకంగా, అనుభవవాద విమర్శకులను ఓడిస్తూ సాగించిన పోరాట చరిత్ర అంతా ఈ తరహా పార్టీ నిర్మాణానికి బాటను వేసింది. ఈ మహాసభ బోల్షివిక్కు పార్టీ కేంద్రకమిటీని ఎన్నుకొని, రష్యాలో విప్లవోద్యమ కృషికి ఆచరణాత్మకంగా మార్గదర్శకం వహించేందుకు ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు, 'ప్రావ్దా' వార్తా పత్రికను ప్రచురించేందుకు నిర్ణయించింది. స్టాలిన్ కేంద్రకమిటీకి ఎన్నికకాబడి కేంద్ర మహాసభ యొక్క రష్యన్ బ్యూరోకు బాధ్యుడిగా నియమింపబడ్డాడు. పార్టీ మహాసభ జరుగుతున్న కాలంలో స్టాలిన్ ప్రవాసంలో శిక్షననుభవిస్తున్నాడు. మహాసభ నిర్ణయన్ని ఆతర్వాత ఆయనకు తెలియచేశారు. 1912 ఫిబ్రవరి 29న స్టాలిన్ తిరిగి ప్రవాసాన్నుండి తప్పించుకొని పార్టీ కేంద్రం యొక్క సంబంధాలలోకి వచ్చాడు. రష్యాలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన జిల్లాలలో స్టాలిన్ పర్యటించి, కార్మికులను ప్రభావితం చేసేవిధంగా శక్తివంతమైన సంస్థాగత నిర్మాణపు ఏర్పాట్లు చేశాడు. ప్రావ్దా వార్తాపత్రికకు కావలసిన నిర్దిష్ట కృషిని, ఏర్పాట్లను సాగించాడు. కానీ అనతికాలంలోనే 1912 ఏప్రిల్ 1న స్టాలిన్‌ను మరోసారి పోలీసులు నిర్బంధించారు. స్టాలిన్ కూడా అదేవిధంగా తిరిగి ఇంకోసారి 1912 సెప్టెంబర్ 1న పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకొని పార్టీ కార్యక్రమాలలో నిమగ్నమయ్యాడు. తిరిగి వచ్చిన వెనువెంటనే ఆయన ప్రావ్దా సంపాదక బాధ్యతలు చూడటంతోపాటు, నాల్గవ డ్యూమా ఎన్నికలలో బోల్షివిక్ ప్రచారానికి మార్గనిర్దేశం చేశాడు. ఈ కాలంలోనే ఆయన ప్రముఖ వ్యాసం 'మార్క్సిజం – జాతుల సమస్య' వెలుగు జూసింది. లెనిన్ ఈ వ్యాసానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చాడు.

1913 ఫిబ్రవరిలో సైంట్ పీటర్స్‌బర్గ్‌లో స్టాలిన్‌ను అరెస్టు చేశారు. ఈసారి బాగా లోతట్టు ప్రాంతానికి నాలుగు సంవత్సరాల ప్రవాసశిక్షకు ఆయన పంపబడ్డాడు.

స్టాలిన్ ప్రవాసంలోనున్న కాలంలోనే 1914లో సామ్రాజ్యవాద యుద్ధం బద్దలైంది. రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన పార్టీలన్నీ కార్మికవర్గాన్ని మోసగించి, కౌట్స్కీ నాయకత్వంలోని సామ్రాజ్యవాద, బూర్జువావర్గ కూటమితో సిగ్గులేకుండా చేతులు కలిపాయి. కౌట్స్కీ మార్క్సిజాన్ని తిరగదోడే ప్రయత్నం చేశాడు. సామాజిక దురహంకారంగా రూపొందిన కౌట్స్కీ రివిజనిస్టు పంథా ఒక పద్ధతి ప్రకారం యూరప్‌లోని వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలలోకి విస్తరించింది. విప్లవ ప్రతీఘాతుక శక్తిగా రివిజనిజం అప్పటి నుండీ వ్యవస్థీకృతం గావించబడుతూ వచ్చింది. లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీ సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడమని పిలుపునిస్తూ తీర్మానించింది. రివిజనిస్టు ద్రోహాన్ని ఓడించేందుకు లెనిన్ 'యుద్ధం – శాంతి – విప్లవం'పై తన ప్రసిద్ధ వ్యాసాన్ని వ్రాశాడు.

1917 మార్చి 12న, దుర్భరమైన తన ప్రవాస జీవితాన్ని పూర్తి చేసుకొని రష్యా విప్లవోద్యమ రాజధాని అయిన పెట్రోగ్రాడ్‌లో స్టాలిన్ అడుగుపెట్టాడు. ప్రావ్దా బాధ్యతలు తీసుకోవలసిందిగా పార్టీ ఆయనను ఆదేశించింది. అజ్ఞాతవాసం నుండి బయటపడి అప్పుడప్పుడే బోల్షివిక్ పార్టీ బహిరంగ కార్యకలాపాలు ప్రారంభించింది. సుదూర ప్రాంతంలో ప్రవాస శిక్షలను అనుభవించిన పార్టీ నాయకులంతా క్రమంగా తిరిగి వస్తున్నారు. లెనిన్ విదేశాల నుండి ఇంకా తిరిగి రాలేదు. స్వదేశం చేరుకోవటానికి తాత్కాలిక బూర్జువా ప్రభుత్వం అడుగడుగునా ఆయనకు ఆటంకాల్ని కల్పిస్తూ వచ్చింది. ఈ పరిస్థితులలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవం నుండి సోషలిస్టు విప్లవానికి మార్పుకోసం పోరాటానికి మాలటోవ్‌తో కలసి స్టాలిన్



కృషి సాగించాడు. బోల్షివిక్ పార్టీ కేంద్రకమిటీని, పెట్రో గ్రాడ్ కమిటీని తదనుగుణంగా స్టాలిన్ మార్గనిర్దేశం చేశాడు.

1917 ఏప్రిల్ 3న లెనిన్ రష్యాకు చేరుకున్నాడు. కార్మికుల ఓ ప్రతినిధి బృందాన్ని వెంట తీసుకొని స్టాలిన్ బైలో ఓస్ట్రోలో లెనిన్‌ను కలుసుకోవటానికి వెళ్ళాడు. లెనిన్ ఆగమనాన్ని పురస్కరించుకొని పెట్రోగ్రాడ్‌లోని ఫిన్‌లాండ్ రైల్వేస్టేషన్‌లో ఏర్పరచిన స్వాగత కార్యక్రమం ఓ శక్తివంతమైన విప్లవ ప్రదర్శనగా రూపుదీసుకొంది. లెనిన్ తన ప్రఖ్యాత ఏప్రిల్ థీసిస్‌ను ప్రతిపాదన చేశాడు. 1917 ఏప్రిల్ 24న బోల్షివిక్ పార్టీ 7వ మహాసభ సమావేశమైంది. ఈ మహాసభలో స్టాలిన్ సంపూర్ణంగా లెనిన్ ప్రతిపాదించిన థీసిస్‌ను సమర్ధించాడు. మహాసభ తదనంతరం, కేంద్ర కమిటి ఆధ్వర్యంలో పొలిట్ బ్యూరో ఏర్పాటు చేయబడింది. స్టాలిన్ పొలిట్ బ్యూరోలో ఓ సభ్యునిగా ఎన్నికయ్యాడు. ఏప్రిల్ థీసిస్ మీద ఆధారపడి ప్రజారాశులను గెలుచుకునేందుకు, సాయుధ తిరుగుబాటుకు వారిని సిద్ధంచేసి శిక్షణ గరిపేందుకు అనుగుణంగా పార్టీ పనిచేసేవిధంగా కర్తవ్యాలను రూపొందించారు. విప్లవోద్యమపు ఈ సంక్లిష్ట సమయంలో, సంఘటనలన్నీ వేగంగా జరిగిపోతున్న నేపథ్యంలో నైపుణ్యంతో, పట్టువిడుపులతో కూడిన ఎత్తుగడలు అవసరమైన ఈ కాలంలో – ప్రజారాశుల పోరాటాలకు లెనిన్, స్టాలిన్‌లు మార్గదర్శకత్వం వహించారు.

1917 జులై సంఘటనల అనంతరం, తాత్కాలిక ప్రభుత్వం మరియు విప్లవ ప్రతీఘాతుకుల నిఘా, వెంటాడటాల నడుమ లెనిన్ అనివార్యంగా పక్కకు తప్పుకోవలసి వచ్చింది. అప్పుడు స్టాలినే స్వయంగా కేంద్రకమిటీని, కేంద్రకమిటి పత్రికను ప్రత్యక్షంగా గైడ్ చేశాడు. విప్లవ ప్రతీఘాత తాత్కాలిక బూర్జువా ప్రభుత్వ న్యాయస్థానాలలో విచారణ నెదుర్కొనేందుకు లెనిన్ ప్రత్యక్షంగా హాజరుకావాలని విద్రోహులైన కామెనోవ్, రైకోవ్, ట్రాట్స్కీలు చేసిన ప్రతిపాదనలను తీవ్రంగా ప్రతిఘటించి, నిలువరించటం ద్వారా ప్రపంచ మానవాళి కోసం లెనిన్ యొక్క విలువైన జీవితాన్ని స్టాలిన్ కాపాడాడు.

1917 జులై – ఆగస్టు మాసాలలో పార్టీ ఆరవ మహాసభ జరిగింది. స్వెర్దలోవ్ మరియు స్టాలిన్‌లు పార్టీ ఆరవ మహాసభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోషలిస్టు విప్లవం కోసం పార్టీ నిర్వహించాల్సిన విధానాలు, ఎత్తుగడలను ఈ మహాసభలో స్పష్టంగా నిర్వచించారు. రష్యాలో సోషలిస్టు విప్లవం విజయం సాధించబోదని ట్రాట్స్కీ పేర్కొన్నాడు.

రష్యాలో సోషలిస్టు విప్లవ విజయం తథ్యమనే లెనిన్ సిద్ధాంతాన్ని నొక్కి చెపుతూ, పార్టీ మహాసభలో స్టాలిన్ అందుకు తన గట్టి మద్దతునందించాడు. లెనిన్, స్టాలిన్‌ల సూచనలతో, సాయుధ తిరుగుబాటుకు, కార్మికవర్గ నియంతృత్వ స్థాపన కోసం పార్టీ ఆరవ కాంగ్రెస్ ఏర్పాట్లను ప్రారంభించింది.

1917 అక్టోబర్ 16న – ప్రజా వెల్లువకు మార్గదర్శకత్వం వహించేందుకు కేంద్రకమిటి స్టాలిన్ నాయకత్వంలో ఓ పార్టీ కేంద్రాన్ని ఎన్నుకొంది. ప్రజా తిరుగుబాటులో విప్లవకర సైనిక కమిటీకి ఈ కేంద్రం, నాయకత్వ బృందంగా వ్యవహరించింది.

అక్టోబర్ 16న జియోన్‌లీవ్, కామెనోవ్‌లు సాయుధ తిరుగుబాటును వ్యతిరేకించారు. విప్లవ వెల్లువను అణచివేయటంలో విప్లవ ప్రతీఘాతకులకు ఈ ఇద్దరు నాయకులు వాస్తవాచరణలో సహకార మందించారు. **(తరువాయి 2వ పేజీలో)**

# భారత ప్రధాని అమెరికా పర్యటన జపాను కేంద్రంగా అమెరికా సామ్రాజ్యవాద తోక పుచ్చుకెళ్ళే విధానాలు

ప్రధాని మోడీ ఇటీవలికాలపు జపాను పర్యటన, ఆస్ట్రేలియా ప్రధాని భారతదేశ పర్యటన, ప్రధాని మోడీ సెప్టెంబరులో అమెరికా పర్యటనలు – ఆయా దేశాలతో మోడీ ప్రభుత్వ సంబంధాల దృష్టి కోణంలో రాజకీయ ప్రాధాన్యతను కలిగివున్నాయి. గత ప్రభుత్వం ఆయా దేశాలతో నెలకొల్పినసంబంధాల తోవన తమ ప్రభుత్వం కొనసాగటమే గాకుండా, వారికి మరింత మెరుగైన అవకాశాలు కల్పించేందుకు తాము సిద్ధంగా వున్నామని గట్టిగా హామీనిచ్చేందుకు మోడీ ఈ పర్యటనను వినియోగించుకున్నాడు.

అమెరికా పర్యటన సందర్భంగా మోడీ, తనకు – తమ ప్రభుత్వానికి అమెరికా గొప్ప నమ్మకమైన సహజమిత్రుడని పేర్కొంటూ తనను తాను ఆవిష్కరించు కోవటానికి తన శాయశక్తులా కృషిచేశాడు. అమెరికా నుండి భారతదేశానికి ఎలాంటి అడ్డంకులూలేక భారీస్థాయిలో ప్రవహించనున్న పెట్టుబడులకు ఎర్రతివాచీ పరిచేందుకు తమ ప్రభుత్వ ఆతృతను ఆయన వ్యక్తం చేశాడు. మాడిసన్ గార్డెన్ స్క్వేర్‌లో పెద్ద సంఖ్యలో – ప్రధానంగా భారత సంతతికి చెందిన ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించాడు. అమెరికా పాలకవర్గ బృందాలను, అనేక అమెరికా కంపెనీలకు చెందిన సిఇఓలను ఆయన కలుసు కున్నాడు. బరాక్ ఒబామాతో ముఖాముఖి సంభాషణలు జరిపాడు. 2014 సెప్టెంబరు 30వ తేదీన 'వాషింగ్టన్ పోస్ట్'లో ఒబామాతో కలసి సంయుక్త సంపాదకీయంలో పాలుపంచుకున్నాడు. చివరగా, ఇరుదేశాల నేతలూ ఉమ్మడి ప్రకటనపై సంతకం చేశారు.

వీరి సంయుక్త సంపాదకీయంలో, భారత – అమెరికా భాగస్వామ్యం 'ధృడమైనది, నమ్మకమైనది' మరియు 'విస్తరిస్తూవున్నద'ని నరేంద్రమోడీ, ఒబామా లిరువురూ ప్రకటిస్తూ తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సంబంధాలు మున్నెన్నటికంటే అధికంగా ద్వైపాక్షిక సహకారానికి, కేంద్ర ప్రభుత్వాల స్థాయిలో మాత్రమే గాకుండా రాష్ట్ర, స్థానిక స్థాయిలకు, ఇరుదేశాల సైనిక, ప్రైవేటు, పౌరసమాజాలకు విస్తరించాలని వారిరువురూ పేర్కొన్నారు. భారతదేశంలో ఒక నూతన ప్రభుత్వమేర్పడటమనేది తమ సంబంధాలను విస్తరించు కోవటానికి, ధృడపరచుకోవటానికి కలిగిన ఓ సహజ అవకాశంగా అమెరికా అధ్యక్షుడు సంతోషంతో పేర్కొన్నాడు. సాంప్రదాయ లక్ష్యాలను అధిగమించి ముందుకు సాగగలమని ప్రగాఢమైన ఆకాంక్షతో, గొప్ప నమ్మకంతో ఆయన వున్నాడు. ప్రపంచస్థాయిలో అమెరికాను అభివృద్ధికి నమూనాగా స్వీకరించి, భారతదేశపు అభివృద్ధి ఎజెండాకు తగినవిధంగా వాణిజ్యం, పెట్టుబడులు మరియు సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని ఒక నూతన ఎజెండాను వారు ప్రకటించారు. "ప్రపంచంలో భాగస్వామ్య దేశాలుగా పరస్పర సహకారంతో స్వేచ్ఛా నౌకా సంచారం, చట్టబద్ధ వాణిజ్యాలను సాగిస్తూ నిఘా విభాగం, చట్టాల అమలు అంశాలను పంచుకోవటం ద్వారా మాతృభూమి భద్రత అంశానికి దీనిని విస్తరింప జేయటానికి కట్టుబడి వున్నామ"ని వారు పేర్కొన్నారు. కలసి కట్టుగా ముందుకు సాగుదామని వారు పిలుపు నిచ్చారు.

నరేంద్రమోడీ, ఒబామా సంతకాలు చేసిన సంయుక్త ప్రకటన కొన్ని అంశాలలో మరింత నిర్దిష్టంగా వుంది.

'జాతీయ', ప్రాంతీయ మరియు ప్రపంచ భద్రతలకు తోడ్పడేలా ఇరుదేశాల సైనిక విభాగాల, జాతీయ భద్రతా విభాగాల నడుమ సహకారాన్ని విస్తరింపచేసుకోవలసిన చర్యల గురించి వారు నొక్కిచెప్పారు. తీరప్రాంత భద్రతను, నౌకాయాన స్వేచ్ఛను కాపాడుతామని, దక్షిణచైనా గగనతలంలో సంచారానికి కట్టుబడివున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భారత – అమెరికాల మధ్య 2005 సం॥నాటి రక్షణ ఒప్పందాన్ని సమీక్షించాలని వారి ఒప్పందంలో పేర్కొన్నారు. పరస్పరం "సన్నిహిత భాగస్వాములుగా" వ్యవహరించాలని, సమిష్టిగా అభివృద్ధిని, ఆయుధ ఉత్పత్తిని సాగించాలని సంయుక్త ప్రకటనలో పునరుద్ఘాటించారు.

నిపుణుల మార్పిడులు, సంయుక్త శిక్షణలు, విన్యాసాలు, పౌర, సైనిక నిఘారంగంలో భాగస్వామ్యం, తీరప్రాంత రక్షణ, నావికా స్వేచ్ఛలకు గ్యారంటీనిస్తూ ఇరుదేశాల నావికా బలగాల మధ్య సహకారాన్ని పెంపొందించటాలతోపాటు సైన్యం నుండి సైన్యం భాగస్వామ్యాలను మరింతగా విస్తరించేందుకు ఆ ప్రకటనలో అంగీకారాన్ని తెలిపారు. భారతదేశంలో 'జాతీయ రక్షణ విశ్వవిద్యాలయాన్ని' నెలకొల్పటంలో అమెరికా కూడా ఒక క్రియాశీలక పాత్ర పోషించనుంది.

భారతదేశపు 'యాక్ట్ ఈస్ట్ పాలసీ' (మన్మోహన్‌సింగ్ దీనిపట్ల అసాధారణ నిబద్ధతను చూపాడు) మరియు అమెరికా 'రీ బ్యాలెన్స్ టు ఆసియా' విధానాల ప్రాధాన్యతను ఈ ప్రకటనలో నొక్కిచెప్పారు. ప్రాంతీయ శాంతి, సుస్థిరతలను కాపాడటంలో ఇతర ఆసియా, పసిఫిక్ దేశాలతో ఇరు దేశాలు మరింత సన్నిహితంగా వ్యవహరిస్తాయని ప్రతినబూనారు. జపాన్‌తో జరిగే త్రైపాక్షిక చర్చలలో ఇరుదేశాల (భారత, అమెరికా) ప్రాధాన్యతను ప్రకటనలో నొక్కి చెప్పారు.

మేధోసంబంధ హక్కుల గురించిన అంశాలపై వ్యవహరించేందుకు 'వార్షిక, ఉన్నత స్థాయి కార్యనిర్వాహక బృందాన్ని' ఏర్పరచాలనే నిర్ణయాన్ని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

మధ్య ఆసియాలోని శక్తివంతమైన ఇంధన వనరులను దక్షిణాసియాకు, అంతిమంగా రష్యా మీదుగా పశ్చిమ దేశాలకు అనుసంధానం చేస్తూ 'న్యూ సిల్క్ రోడ్' నిర్మించాలనే అమెరికా పథకాన్ని గురించి ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

తీవ్రవాద వ్యతిరేక పోరాటంలో భారత, అమెరికాల మధ్య నిఘా సహకారాన్ని ఈ ప్రకటన పేర్కొంది.

నూతన డబ్ల్యుటిఓ ఒప్పందంపై వివాదాల గురించి అధికారుల స్థాయిలో సంప్రదించుకోవాలనే అవగాహనను ఈ ప్రకటనలో పొందుపరిచారు. పౌర అణుఒప్పందంపై వివాదాల పరిష్కారానికి నూతన బృందాన్ని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఇరాన్ అణు కార్యక్రమంగా ఆరోపించబడుతున్న దానిపై ఐక్యరాజ్యసమితి తీర్మానాలకు ఆ దేశం కట్టుబడి వుండాల్సిందిగా ఈ ప్రకటన పిలుపు నిచ్చింది.

ఈవిధంగా మోడీ కుదుర్చుకున్న ఈ ఒప్పందాలు, అవగాహనలు విపులమైనవిగా వుండి భారతదేశానికి, దేశ ప్రజలకు దీర్ఘకాల విపరిణామాలకు కారణంగా వున్నాయి.

## కాంగ్రెస్ అడుగుజాడలలో...

'వాషింగ్టన్ పోస్టు'లోని తమ సంయుక్త సంపాదకీయంలో '2000 సం॥లో ప్రధాని అటల్ బీహారి వాజ్‌పేయి మనలను సహజమిత్రులుగా ప్రకటించారు. ఇది వాస్తవమ'ని ఇరుదేశాల నేతలూ పేర్కొన్నారు. సోవియట్ పతనానంతర కాలంలోనూ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాల ప్రారంభంతోనూ అమెరికాతో భారతదేశ సంబంధాలు వేగం పుంజుకున్నాయి. 1992లో నాటి ప్రధాని పి.వి. నరసింహారావు "ప్రత్యక్ష బెదిరింపులతో సహా రక్షణ, వ్యూహాత్మక అంశాల"పై చర్చలను ప్రారంభించారు. భారత – అమెరికా రక్షణ సేవలలో ద్వైపాక్షిక సహకారాన్ని పొడిగించేందుకు చర్యలు చేపట్టారు. 1995లో ఇరుదేశాలూ "రక్షణ విధాన బృందాన్ని' ఏర్పరచాయి.

వాజ్‌పేయి పాలనా కాలంలో, 2000 సెప్టెంబరులో ఆయన అమెరికా పర్యటన సందర్భంలో భారత, అమెరికాలు "సహజ మిత్రులని" ప్రకటించాడు. జార్జి డబ్ల్యు బుష్ పాలనా కాలంలో భారతదేశంతో 'వ్యూహాత్మక భాగస్వామ్యంలో తరువాయి అడుగు'ను ప్రారంభించాడు. మన్మోహన్ సింగ్ ప్రధానిగానున్న కాలంలో అమెరికాతో 2005లో 'రక్షణ చట్ట ఒప్పందం'పై సంతకం చేశాడు. ఆయన భారత్, అమెరికాలు "వ్యూహాత్మక భాగస్వాముల"ని పేర్కొన్నాడు. భారతదేశంలోని ప్రతిపక్షాల వ్యతిరేకతలను లెక్కజేయకుండా అమెరికాతో, ద్వైపాక్షిక అణు సహకార ఒప్పందాన్ని ఆమోదింప జేయటానికి పార్లమెంటుపై వత్తిడి తెచ్చాడు. ఆసియాలో అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక కూటమిలో భాగస్వాములుగానున్న జపాను, ఆస్ట్రేలియాలతో వ్యూహాత్మక సంబంధాలకు మన్మోహన్ పాలనా కాలంలో అత్యధిక ప్రాధాన్యమిచ్చాడు. 2013లో 'రక్షణ రంగంలో వాణిజ్యం మరియు సాంకేతికతల చొరవ'ను ఆయన ప్రారంభించాడు. 'లుక్ ఈస్ట్ పాలసీ' (తూర్పుదిక్కు చూడండి అనే విధానం)గా చెప్పబడేదానితో అమెరికాను, దాని కూటమిలో సభ్య దేశమైన జపాన్‌ను సమన్వయ పరిచాడు. యుపిఏ ప్రభుత్వం వదలిన చెప్పులలో కాళ్ళు దూర్చిన ప్రస్తుత నరేంద్రమోడి ప్రభుత్వం, ఆసియాలో అమెరికా నేతృత్వంలోని అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా త్రయంతో వ్యూహాత్మక కూటమిని ఏర్పరచుకునే విధానాన్ని ముందుకు తీసుకువెళ్తోంది.

## విధ్వంసకర పరిణామాలు

నరేంద్రమోడి అమెరికాతో వచ్చిన అవగాహనలు, చేసుకున్న ఒప్పందాలు మనదేశ, ప్రజా ప్రయోజనాలరీత్యానేగాక రెండు కారణాల రీత్యా ప్రపంచ ప్రజల ప్రయోజనాలకే తీవ్ర నష్టకరమైనవిగా వున్నాయి. ఒకటి – మనదేశంపై, ప్రజలపై, వారి ఆర్థిక జీవనంపై తన పట్టును మరింత బిగించి, తన దోపిడీ కోరలను మరింతగా సాచటానికి అమెరికాకు అత్యంత అనుకూలమైన అవకాశాల్ని ఈ ఒప్పందాలు, అవగాహనలు కల్పిస్తున్నాయి.

ఆయుధాల ఉత్పత్తి, వ్యాపారం వంటి రంగాలలో భారీస్థాయి అమెరికా పెట్టుబడులకు, జోక్యానికి అవకాశాలు విస్తృతంగావటంతో; రక్షణ, భద్రత, నిఘా, సైనిక శిక్షణ, విధానపరమైన అంశాలు మరియు, మనదేశ, మన ప్రజల అనుల్లంఘ నీయమైన సార్వభౌమాధికార అంశాలలో సున్నితమైన, కీలకమైన మనదేశ పునాదులన్నీ అమెరికా ఆధిపత్య వ్యూహంలో ప్రమాదకరంగా చిక్కుకుంటాయి.

రెండు – ఆసియా ప్రాంతంలో లభ్యమయ్యే పుష్కలమైన సహజ వనరులపై అదుపును సాధించేందుకు నిరాటంకంగా, భద్రంగా వాటిని తరలించేందుకు అవసరమైన భూ, జల, వాయు మార్గాలపై అదుపును సాధించేందుకు అమెరికా వ్యూహం వుద్దేశించబడింది.

ఇక్కడ అమెరికాకు సన్నిహిత మిత్రులైన జపాను, ఆస్ట్రేలియాలతోపాటుగా అమెరికా సైనిక స్థావరాలను, సైన్యం మోహరింపును, కార్య కలాపాలను కలిగివున్న దక్షిణ కొరియా, ఫిలిప్పీన్, ఆఫ్ఘనిస్తాన్‌ల వంటి దేశాలున్నాయి. తనతో బంధించుకున్న లేదా తన కూటమితో ఉన్న దేశాలున్నాయి. ఈ ప్రాంతంలోని విలువైన వనరులను కబళించటం, జోక్యందారీ, ఆధిపత్య చర్యలనేవి ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలకు, అస్థిరత్వానికి, ఆగ్రహ వ్యతిరేకతలకు, విభేదాలకు కారణంగా ఉన్నాయి. ఆసియాలో తమ పథకాలకు చైనాను శక్తివంతమైన అడ్డంకిగా అమెరికా మరియు జపాన్ పాలకులు భావిస్తున్నారు. చైనాకు వ్యతిరేకంగా ప్రజలను, దేశాలను ఉసికొల్పటం; దేశాల, ప్రజల మధ్య విభజన బీజాలు వెదజల్లటం, తద్వారా తన నేతృత్వం లోని కూటమిలోకి దేశాలను, ప్రజలను కూడగట్టడమనే చర్యలు ఆసియాలో అమెరికా వ్యూహంలో ప్రధాన భాగంగా మారాయి. భారతదేశంతో అమెరికా తన వ్యూహాత్మక కూటమి ద్వారా భారత ఆర్థికవ్యవస్థ, రాజకీయాలు, సైన్యం, రక్షణచర్యలపై పట్టు ద్వారా పెత్తనాన్ని సాధించాలనే వ్యూహాన్ని నెరవేర్చుకోవటానికి అమెరికాకు అత్యధిక అవకాశా లున్నాయి. అమెరికాతో మోడీ ఈ ఒప్పందాలు, అవగాహనలకు రావటం ద్వారా, అమెరికా సామ్రాజ్య వాదానికి భారతదేశాన్ని లోబరిచి, బానిసత్వాన్ని కల్పించి, దేశాన్ని తనకు తానుగా ప్రమాదకర తీరాలకు చేర్చాడు.

"భాగస్వామ్యాలు", "కూటములు" అనబడేవి వివిధ ప్రయోజనాల సాధనకు వివిధ రకాలుగా వుంటాయి. ఇతర దేశాల ప్రాంతాలను, వనరులను కబళించేందుకు, తమ మధ్య తాము పంపిణీ చేసుకునేందుకు సామ్రాజ్యవాద దేశాలు ఒక 'భాగస్వామ్యం'లోకి ప్రవేశించవచ్చు. ఈ తరహా భాగస్వామ్యం దోపిడీ సాగించుకోవటానికి వీలుగా, అణచివేత స్వభావం కలిగి వుంటుంది. కనుక స్వేచ్ఛ, న్యాయాన్ని ప్రేమించే ప్రజలెవ్వరూ ఈ తరహా భాగస్వామ్యానికి మద్దతుగా నిలవరు.

అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశంతో భారతదేశం వంటి దేశం ఒక కూటమి లేదా భాగస్వామ్యం కలిగి వుండటమంటే, ఆయా సామ్రాజ్యవాద శక్తులకు చేసిన సేవలకుగాను దోపిడీ సొమ్ములో నుండి చిన్న భాగాన్ని పొందే ఈ ఒప్పందము కూడా లూటీ చేసేదీ, అణచివేసేదే! కనుక, భారత ప్రజలు దీనిని తిరస్కరించాలి, వ్యతిరేకించాలి.

భారతదేశానికి గొప్ప ఆధిపత్య స్థానం కావాలని ఆకాంక్షించేవారు దేశంలో కొందరున్నారు. భారతదేశం తనకు తానుగా అమెరికాతో లేదా ఇతర సామ్రాజ్యవాద శక్తులతో ముడివేసుకోవటం ద్వారా, భారత ఆర్థికవ్యవస్థను, భారతదేశ అభివృద్ధిని వారి ఆధీనంలో ఉంచటం ద్వారా ఆ విధమైన హోదాను, ఉన్నతిని సాధించగలుగుతుందని ఒప్పించటానికి వారు ప్రయత్నిస్తారు. ఇది పూర్తిగా డొల్లతనం లేదా తప్పుదోవ పట్టించబడిన జాతీయవాదం! ఏదేని సామ్రాజ్యవాద శక్తిపై ఆధారపడో, ఆధారపడకుండానో అయినప్పటికీ, ఇతర దేశాలపై ఆధిపత్యం సాగించాలనే ఆలోచనే ఖండించదగినది. వాస్తవంలో ఈ 'భాగస్వామ్యం' 'కూటమి'లనేవి సామ్రాజ్యవాదుల దోపిడీకి, ఆధిపత్యానికి సేవచేసేందుకు ముసుగులు మాత్రమే!

సామ్రాజ్యవాదుల దోపిడీ, అణచివేత, ఆధిపత్య విధానాలు, చర్యలకు వ్యతిరేకంగా అణచి వేయబడుతున్న జాతులు, ప్రజలందరూ తమ ఐక్య శక్తిని, పోరాటాన్ని చాటేందుకు ఒక కూటమిగా ఏర్పడవచ్చు. ఈ విధమైన కూటములు న్యాయమైనవి, అవసరమైనవి, ఆహ్వానించదగినవీ కూడా.

అమెరికా, భారత పాలకులు తమ ప్రకటనలో ఉపయోగించిన 'భాగస్వామ్యం', 'కూటమి', 'ఉమ్మడి ప్రయోజనాలు', 'మెరుగైన భవిష్యత్తు', 'సమానత్వం', 'భద్రత', 'స్థిరత్వం', 'శాంతి' వంటి పదాలన్నీ వినసొంపైనవి. కానీ వాస్తవికంగా అవి డొల్ల అయినవి. అంతేగాక భారత ప్రజలకు వ్యతిరేకంగా మోసానికి నిలువెత్తు రూపాలు. ఆసియాపైన, మొత్తంగా ప్రపంచంపైనే ఆధిపత్యం చెలాయించాలనుకునే సామ్రాజ్యవాద శక్తితో కూటమిగా వుండటమంటే, సామ్రాజ్య వాదుల దోపిడీ, అణచివేతలకు, ఆధిపత్య యుద్ధరాజకీయాలకు బాధితులుగానున్న ప్రపంచంలోని, ఆసియాలోని ఇతర దేశాల ప్రజలతో అనవసర మైన, అవాంఛితమైన వైరుధ్యంలోకి, శత్రుత్వంలోకి, విబేధాలలోకి భారతదేశ ప్రజలను ఈడ్చటమే!

భారత పాలకవర్గాలు సాధారణంగానూ, ప్రత్యేకించి ప్రస్తుత నరేంద్రమోడీ ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న 'వ్యూహాత్మక ఒప్పందాల', చేసుకున్న 'అవగాహనల', చేరిన 'కూటముల' నిజ స్వభావాన్ని వెల్లడిచేయాలి. కార్మిక వర్గాన్ని, రైతాంగాన్ని, మహిళలను ఇతర అణచివేతకు గురయ్యే విభాగాల ప్రజలను, ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులను సమైక్యపరచి, సంఘటితపరచి ఈ ఒప్పందాల ఘోరమైన విపరిణామాలకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాలు సాగించాలి. ✡




మతోన్మాదం - సామ్రాజ్యవాదం - భారత పాలకులు

(వ్యాస సంకలనం)

సిపిఐ(ఎం-ఎల్) ప్రచురణ

పేజీలు : 80

వెల : రు. 30/-

కాపీలకు : మైత్రీబుక్‌హౌస్

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# ‘భూమిపై హక్కు గిరిజనులదేనని చాటి చెప్పన్న కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల అమరత్వం’

## కొండమొదలులో జరిగిన రాజులు, లక్ష్మయ్యల వర్ధంతిసభలో కా॥ఇల్లా రామిరెడ్డి

**కొండమొదలు, 29-11-14 :**

కొండమొదలు ఆదివాసి భూపోరాటంలో పోలీసు కాల్పులకి గురై అమరులైన కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల 32వ వర్ధంతి సభ తూర్పుగోదావరిజిల్లా, దేవిపట్నం మండలం - కొండమొదలులో 29-11-2014న జరిగింది. కొండమొదలు చుట్టుపక్కల గూడేలలో ఉదయం 10 గంటలకు ఏజెన్సీ గిరిజన సంఘం జెండాలను ఎగురవేసి మధ్యాహ్నం 12 గంటలకు కా॥ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల స్థూపందగ్గరికి ప్రజలందరూ చేరుకున్నారు. ఏజెన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కా॥ కుంజం గంగరాజు ఎర్రజెండాని ఎగురువేయగా సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ ఇల్లా రామిరెడ్డి, సంఘం పశ్చిమగోదారిజిల్లా కార్యదర్శి కా॥ కుంజం రామారావు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ఎంఎస్ నాగరాజు స్థూపానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. మంటూరు, కొండమొదలు సంఘం నాయకులు మరియు గ్రామ పెద్దలు పూలు వుంచి నివాళులర్పించారు.

అనంతరం ఏజెన్సీ గిరిజన సంఘం ఉపాధ్యక్షులు కా॥మడెం పండయ్య అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో కా॥ఇల్లా రామిరెడ్డి మాట్లాడుతూ కా॥కుంజం రాజులు, మడిం లక్ష్మయ్యలు అమరులై 30 సం॥లు దాటినప్పటికి వారి ఆశయం ఇంకా నెరవేరలేదని, ఏ భూమికోసం అయితే వారు ప్రాణాలు త్యాగంచేసి రక్తం చిందించారో ఆ భూమి మీద హక్కు మనకు దక్కనీయ కుండా ఈనాటికి కూడా గిరిజనేతర భూస్వాములతో కుమ్మక్కు అయిన ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదన్నారు. 1982వ సంవత్సరంలో కాల్పులు జరిగి కుంజం రాజులు, మడిం లక్ష్మయ్యలు చనిపోయారు. పాములేటి గంగిరెడ్డి (భూస్వాములు పెట్టిన తప్పుడు కేసులలో జైలుకెళ్ళి) జైల్లో చనిపోయాడు. వందలమంది ప్రజలు జైళ్ళచుట్టూ తిరిగారు. రెవిన్యూ కోర్టులన్నీ గిరిజనులకి అనుకూలంగా తీర్పులు ఇవ్వగా ఆ తీర్పులను హైకోర్టు, సుప్రీంకోర్టులు కూడ ధృవీకరించినప్పటికీ, గత 40 సంవత్సరాలుగా భూములపై మనం సాగులో ఉన్నప్పటికీ, భూముల మీద మనకు హక్కు కల్పించ లేదన్నారు. పోగా, భూములకోసం పోరాటం సాగుతున్న సమయంలో సెటిల్‌మెంట్ అధికార్లకి లంచాలు ఇచ్చి భూస్వాములు చేయించుకున్న సెటిల్‌మెంట్ ఆర్డర్‌లను రద్దుచేయకుండా, పోలవరం ప్రాజెక్టు పేరుతో భూస్వాము లకు మేలుచేసేందుకు, భూస్వాములకు సెటిల్‌మెంట్ ఆర్డర్‌లు ఉన్నాయి కనుక వారికి నష్టపరిహారం ఇస్తా మంటున్నారు. గతంలో గిరిజనులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పులన్నిటిని రెవిన్యూ అధికారులు ఇప్పుడు మళ్ళీ తిరగ తోడుతున్నారు. ఇటువంటి కుట్రలన్ని మనం గమనించు కుంటూ మనం పోరాడి సాధించుకున్న భూములకి హక్కుసాధించడం కోసం మరింత సంఘటితంగా పోరాటాలు చేయడం ద్వారా అమరులైన కామ్రేడ్స్ ఆశయాలను సాధిద్దామని చెబుతూ కా॥రామిరెడ్డి తన ఉపన్యాసం ముగించారు.



రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ఎంఎస్ నాగరాజు మాట్లాడుతూ కొండమొదలు భూపోరాటస్ఫూర్తితో, దేవీపట్నం ఏరియాతోపాటు, పశ్చిమగోదావరి జిల్లాలో పోరాటాలు సాగిస్తూవస్తున్నామన్నారు. ఆ క్రమంలో మనుగోపాల జమీందారు రాంపండు తుపాకి గుండ్లకు కారం పార్వతి, విజయనగరంజిల్లా దుగ్గేరు ప్రాంత భూపోరాటంలో భూస్వాముల దాడిలో కామ్రేడ్ జెన్ని తిరుపతి అమరులయ్యారని, ఈ కామ్రేడ్స్ అందరికి, పీడిత ప్రజలకోసం తమ జీవితాలను త్యాగంచేసి అమరులైన మరెంతో మంది నాయకులకి, కార్యకర్తలకు, ప్రజలందరికీ విప్లవజోహార్లు అర్పించారు.

పోలవరంప్రాజెక్టును మూడున్నర సంవత్సరాలలో పూర్తిచేస్తామని కొత్తగా వచ్చిన పాలకులు చెబుతున్నారని, 2004లో ఈ ప్రాజెక్టు మొదలుపెట్టిన కాంగ్రెస్‌పార్టీ 9 ఏళ్ళలో పూర్తి చేస్తామన్నారని, అప్పటినుండి ముంపుకు గురయ్యేప్రజలకు భూమికి, భూమి, ఇల్లుకి ఇల్లు సమగ్రమైన, శాస్త్రీయ పునరావాసం కల్పించాలని మనంపోరాడుతున్నామన్నారు. పునరావాసం కల్పించిన గ్రామాలలో ఇప్పటి వరకు భూమి చూపించలేదని, ఇటువంటి అనుభవాలన్నీ మనముందున్నాయన్నారు. అంతర్జాతీయ పునరావాస సదస్సు 2001లో జపాన్ దేశం క్యోటో నగరంలో జరిగిందని, ఈ సమావేశానికి మనరాష్ట్రం నుండి ఆనాటి నీటిపారుదల శాఖమంత్రి కడియం శ్రీహరి హాజరయ్యారని, ఆనాటి తీర్మానం ఈ విధముగా చెబుతున్నదన్నారు. (1) ఎక్కడైనా ప్రాజెక్టులు కట్టాలంటే 10వేలమంది జనాభాకంటే ఎక్కువ ముంపుకి గురిచేయకూడదని, (2) గ్రామ సభల అనుమతులు తప్పనిసరని (3) ప్రాజెక్టువల్ల ఎవరు అయితే నష్టపోతున్నారో, ఆ ప్రాజెక్టువల్ల లబ్ధిపొందే వారిలో మొదటి ప్రాధాన్యతవారికే ఇవ్వాలని చెబుతున్నప్పటికీ ఇవి ఏవీ పాలకులకి పట్టడం లేదన్నారు.

పోలవరం ప్రాజెక్టు రైతాంగంయొక్క సాగునీటి ప్రయోజనాలకోసం కాదని, నౌకాయానం ద్వారా, విద్యుదుత్పత్తి ద్వారా సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు నెరవేర్చడంకోసమేనని, ఈరోజు మరింత స్పష్టమౌతున్నదన్నారు. ప్రాజెక్టు పూర్తిచేయాలంటే ఎక్కువ కాలం పడుతుంది కనుక, 1800 కోట్ల రూపాయలతో 8 నెలల్లో ఎత్తిపోతల నిర్మాణం ద్వారా క్రిష్ణాబ్యారేజీకి నీరుఅందించి రైతాంగం ప్రయోజనాలు నెరవేర్చుతామంటున్నారని, ఇదంతా వట్టిబూటకమనీ, కేవలం రాజధాని అవసరాలకోసం నీరు తీసుకెళ్ళటానికేనని స్పష్టమౌతున్నదన్నారు. ముంపుకి గురయ్యే ప్రజలకి ఆత్మగౌరవంగా బ్రతకడానికి కావాల్సిన పునరావాసం కల్పించకుండా అందుకోసం పోరాడుతున్న మన సంఘ నాయకులుపై రాజద్రోహం నేరంలాంటి కేసులు బనాయించి ఇప్పటికీ జైళ్ళ చుట్టూ తిప్పుతున్నారన్నారు. సమగ్రమైన శాస్త్రీయ పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఏజన్సీ గిరిజనసంఘం సీనియర్ నాయకుడు కా॥మాడే సిరమయ్య, చింతలాడ సుధాకరరెడ్డి, తామా భవానీలు ఈ ఆందోళనలో చనిపోయారని, తీవ్రగాయాలై కొద్దిరోజులు తరువాత మరొక కామ్రేడ్ చనిపోయారని, ఇంత జరిగినప్పటికీ నిర్వాసితులుకి సక్రమమైన ప్యాకేజీ కల్పించకుండా మాయమాటలు చెబుతున్నారన్నారు. అడవి నుండి, భూమి నుండి ఆదివాసి ప్రజలను గెంటివేయడానికి చాలా పెద్ద కుట్రలు జరుగుతున్నాయని ఈ కుట్రలకు వ్యతిరేకంగా కా॥కుంజం రాజులు, మడిం లక్ష్మయ్యల స్ఫూర్తితో పోరాడాల్సిందిగా పిలుపునిచ్చారు.

ఇంకా ఈ సభలో కామ్రేడ్ కుంజం రామారావు, సంఘ నాయకులు కా॥చదల వీరపురెడ్డి, ఏజన్సీప్రాంత మహిళా సంఘం నాయకులు కా॥విజయ తదితరులు ప్రసంగించారు. ✡

# ‘గిరిజనుల గౌరవప్రదమైన జీవితం భూమిసమస్యతో ముడిపడి ఉంది’

## మనుగోపులలో జరిగిన కా॥ కారంపార్వతి వర్ధంతిసభలో వక్తల ఉద్ఘాటన





కామ్రేడ్ కారం పార్వతికి నివాళులర్పించేందుకు ప్రదర్శనగా తరలివస్తున్న గిరిజనులు; వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి

**మనుగోపుల, 4-11-14 :**

పోలవరం గిరిజనోద్యమంలో, మాజీ జమిందారు హోతా శ్రీరామచంద్రమూర్తి (రాంపండు) తుపాకీ కాల్పులకు బలైన అమరులు కామ్రేడ్ కారం పార్వతి 17వ వర్ధంతి సభ 4-11-2014న మనుగోపాలలో జరిగింది. ముందుగా కామ్రేడ్ పార్వతి స్థూపం వద్ద గిరిజన, గిరిజనేతర పేదల హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి జెండా ఎగురవేసి నివాళులర్పించారు. అన్ని సంఘాల నాయకులు, అన్ని గ్రామాల పెద్దలు స్థూపం వద్ద పూలను ఉంచి, జోహార్లు తెలిపారు.

ఈ సభకు పశ్చిమగోదావరి జిల్లా ఏజెన్సీ గిరిజన సంఘ కార్యదర్శి కామ్రేడ్ కుంజం రామారావు అధ్యక్షత వహించారు. అధ్యక్షులు మాట్లాడుతూ ‘కామ్రేడ్ కారం పార్వతి అమరత్వం, గిరిజన ప్రజానీకంలో చైతన్యం నింపింది, ఆ పోరాట స్ఫూర్తితోనే అనేక ప్రాంతాల ప్రజానీకం తమ భూముల స్వాధీనానికి కదిలారు. నేడు 17వ వర్ధంతి సభ జరుపుకుంటున్నామంటే కామ్రేడ్ కారం పార్వతి త్యాగం గిరిజన, గిరిజనేతర ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంద’న్నారు.

ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్ సవలం రాంబాబు మాట్లాడుతూ, ‘నేడు ఈ ప్రాంత గిరిజనులు ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో బ్రతుకుతున్నారు. తిండి, బట్ట, నివాసం లాంటి కనీస సౌకర్యాలు పొందడమేకాక పిల్లలను ఏదోమేరకు చదివించుకుంటున్నాం. ఆస్పత్రులకు వెళ్ళగలుగుతున్నాం. అధికారులకు మన సమస్యలు చెప్పగలుగుతున్నాం. అంటే అది ఏజెన్సీ గిరిజన సంఘం కృషి, కామ్రేడ్ కారం పార్వతి త్యాగ ఫలితమే’నన్నారు.

ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్ పద్దం కృష్ణమూర్తి మాట్లాడుతూ ‘ఏజెన్సీ గిరిజన సంఘం సభ్యుల అనితరమైన త్యాగాల కృషి ఫలితంగా నేడు కుంకాల ప్రాంత గిరిజన, గిరిజనేతర పేదలు భూమిని నమ్ముకుని బ్రతుకుతున్నారు. ఉద్యమం ప్రతి మలుపులో నాయకత్వం పాత్ర, ప్రజల భాగస్వామ్యంతో నేటికీ భూమిని సాగుచేసుకుంటున్నా’రన్నారు.

గిరిజన, గిరిజనేతర హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి మాట్లాడుతూ - 1995లో కుంకాల నుంచి కొండమొదలుదాకా గిరిజన యువకుల్ని వెంటపెట్టుకొని నడిపించుకు వచ్చిన కామ్రేడ్ కొక్కర చంద్రయ్యకు మనం మొదటగా నివాళులర్పించాలన్నారు. తాము దశాబ్దాల తరబడి కోర్టుల చుట్టూ, రెవిన్యూ అధికారుల చుట్టూ తిరిగి అధికార్లు, పోలీసులు జమిందార్లకే వత్తాసుగా, తొత్తులుగా మారడం చూసి; విసిగి, వేసారి, పోరాటం తప్ప వేరే మార్గంలేదని; అందుకు గిరిజనులందరిని సంఘటితపరచి, ఏజెన్సీ గిరిజనసంఘం నాయకత్వంలో ముందుకు సాగాలన్న కామ్రేడ్ కొక్కర చంద్రయ్య కృషి మరువలేనిదన్నారు. ‘మాజీ జమిందారు నాయకత్వంలో భూస్వాములు మన గ్రామస్తులపైబడి ఇళ్ళను కూల్చివేశారు, ఆహారపదార్థాలు, ధాన్యాన్ని తగల బెట్టారు. ఒక కామ్రేడ్‌ను తీసుకెళ్ళి పొగాకు బ్యారన్‌లో పెట్టి చంపడానికి ప్రయత్నించారు. భూస్వాముల, జమిందారుల చర్యలన్నీ గిరిజనుల్ని సంఘటితం చేయటానికే ఏజెన్సీ గిరిజనసంఘం ఉపయోగించిం దన్నారు. పోలీసుల, అధికారుల దన్ను చూసుకొని, డబ్బు మదంతో జమిందారు ప్రజలపై దాడికి వచ్చి, స్వయంగా కారం పార్వతిని కాల్చి చంపాడనీ, నేటికీ ఆ మాజీ జమిందారుకు ఎలాంటి శిక్ష పడలేదనీ, పైగా నేటికీ భూములు కాజేయడానికి కుట్రలు చేస్తూనే ఉన్నాడని; నాటి నుండి నేటి వరకు కారం పార్వతి అమరత్వం, ప్రజల చైతన్యం, పోరాటచేవ ప్రస్ఫుటమౌతుందని, ప్రజలు మరిన్ని త్యాగాలతో, చైతన్యాలతో భూమి సాగుచేసుకోవటమేకాక, పూర్తి హక్కులు సాధించాలని, అలాంటి నిరంతర చైతన్యంతోనే ప్రజా ఉద్యమాలు విజయం సాధిస్తాయని, విస్తరించి మరింత ముందుకు పోగలుగుతాయన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ నాగరాజు మాట్లాడుతూ ఇలాంటి వర్ధంతిసభలు గిరిజనోద్యమం విస్తరించడానికి, గిరిజనుల సమస్యల పరిష్కారానికి, భూమిపై హక్కులు సాధించుకోవడానికి స్ఫూర్తిగా నిలబడాలన్నారు. కాల్పులు జరిపి కారం పార్వతిని బలిగొన్న రాంపండు ఉన్నతాధికారులంతా తన గుప్పిట్లో ఉన్నారని, మరలా మనల్ని వంచించి, ప్రాజెక్టును అడ్డంపెట్టుకుని లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడని ఆర్.డి.ఓ. ద్వారా చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టామని; నేడు మరల అవే కుట్రలు చేస్తున్నాడని, అందుకు గిరిజన దళారులు వంతపాడుతున్నారని, వాటిని అప్రమత్తతో, చైతన్యంతో త్రిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ✡

# ‘ఈ రాజ్యాంగం, న్యాయవ్యవస్థ ప్రజల పక్షమా? అగ్రకులం, డబ్బు, అధికారం కలవారి పక్షమా? తేల్చాలి’

## – చుండూరు దళితుల న్యాయపోరాట కమిటి ఛైర్మన్ బొజ్జా తారకం సూటిప్రశ్న



ప్రాంతీయ సదస్సుకు హాజరైన ప్రజానీకానికి అభివాదం చేస్తున్న వక్తలు; ప్రధాన ఉపన్యాసం చేస్తున్న బొజ్జా తారకం; సదస్సుకు హాజరైన ప్రజానీకం

**విజయవాడ, 26-11-14 :**

1991 ఆగస్టు 6న చుండూరు దళితులపై అగ్రకుల రెడ్డి, కాపు కులస్థులు సాగించిన మారణకాండ కేసుపై అప్పీలు సందర్భంగా క్రింది న్యాయస్థానం విధించిన శిక్షలనుసైతం రద్దుచేస్తూ హైకోర్టు ధర్మాసనం తీర్పునివ్వటంపట్ల ప్రజలు, ప్రజాతంత్రవాదులు, విప్లవ, దళిత, ప్రజా, హక్కుల సంఘాలలో తీవ్ర స్పందనలు వ్యక్తమయ్యాయి.

చుండూరు కేసుపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో ‘జడ్జీల నియామకం-వారి జవాబుదారీతనం’ అనే అంశంపై దేశవ్యాపిత చర్చ నిర్వహించి, న్యాయ వ్యవస్థనే ప్రజలముందు దోషిగా నిలబెట్టేందుకు ‘చుండూరు దళితుల న్యాయపోరాటకమిటి’ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తూ వస్తోంది.

అందులో భాగంగా, విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో 26-11-14న జరిగిన నాల్గవ ప్రాంతీయ సదస్సుకు **రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సి** అధ్యక్షత వహించారు.

సదస్సులో ప్రధానవక్తగా విచ్చేసిన **చుండూరు దళితుల న్యాయపోరాట కమిటి ఛైర్మన్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది బొజ్జా తారకం** మాట్లాడుతూ చట్టాలు, రాజ్యాంగం ప్రకారం జడ్జీలు తీర్పు నివ్వాలని, కులం, డబ్బు, అధికారాన్నిబట్టి తీర్పులివ్వటాన్ని ఆయన తప్పుబడుతూ ఇది ప్రజాస్వామ్యమా లేక ధనస్వామ్యమా అని ప్రశ్నించారు.

శ్రమకు తగ్గ వేతనమడిగితే లాఠీఛార్జీ చేస్తున్నారు -అయినా ప్రశ్నిస్తే జైళ్ళలో పెడ్తున్నారు. లేదంటే కాల్చి పారేస్తున్నారు. ఈ పరిస్థితి ఎంతకాలం సాగిస్తారని నిలదీయటానికే ఈ సదస్సు పెట్టామని తారకం పేర్కొన్నారు.

భూమి పేద ప్రజలకు పంచుతామంటారు-పంచరు. జపాను, సింగపూర్లు తిరిగి బడా ఎమ్ఎన్‌సిలకు ఎర్రతివాచీ పరుస్తున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలు ప్రజల పీకనొక్కు తున్నాయి. మనదేశంలో వున్న వనరులని ఉపయోగించి మన ప్రజలను అభివృద్ధిచేయలేమా అని ఆయన పాలకులను ప్రశ్నించారు.

కారంచేడులో, చుండూరులో ఆత్మగౌరవంగా బ్రతుకుతామంటే, లక్ష్మింపేటలో ప్రభుత్వ భూములు కావాలంటే ఊచకోతకోయటాన్ని ఆయన తీవ్రంగా ప్రశ్నిస్తూ ఈన్యాయవ్యవస్థ, పోలీసులు, రాజ్యాంగం ఎవరికోసమున్నాయో తేల్చాలన్నారు.

రాజ్యాంగంప్రకారం తాము వ్యవహరించబోమని, డబ్బు, అధికారానికే తాము దాసోహమంటామని న్యాయవ్యవస్థ ప్రకటించి, న్యాయ వ్యవస్థను మూసివేసి వీధుల్లోకి వస్తే, ప్రజలు తమ బలాన్ని నిరూపించుకొని, తమ న్యాయం సాధించుకుంటారని బొజ్జా తారకం ఉద్వేగంగా పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను నిలదీసి ప్రశ్నించటంద్వారా దళితులు, పీడితులు తమ హక్కులు సాధించుకోగలుగుతారనే విశ్వాసాన్ని వ్యక్తంచేస్తూ, పోరాట కమిటి భాగస్వామ్య సంఘాలు కూడా అందుకు సమిష్టిగా కృషి సాగిస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కా॥ సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ రాజ్యాంగం, పాలనావ్యవస్థ, న్యాయస్థానాలు అగ్రకుల సంపన్నవర్గాల పక్షమేనని చుండూరు తీర్పు అప్పీల్‌పై హైకోర్టుతీర్పు సందర్భంగా మరోసారి రుజువైందన్నారు. బాధిత దళిత ప్రజలకు వ్యతిరేకమైన, న్యాయానికే కళంకితమైన తీర్పునిచ్చిన ఆ న్యాయమూర్తిని దళితులపై ఘోరమైన హత్యాకాండలు సాగుతున్న బీహార్ రాష్ట్రప్రధాన న్యాయమూర్తిగా నియమించటాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు.

విప్లవ, దళిత, పీడితప్రజాసంఘాల, ప్రజాస్వామిక వాదుల ఐక్యఉద్యమాల ద్వారానే బాధితులకు ఏమేరకైనా న్యాయం లభిస్తుందని ఆమె నొక్కి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల, సంపన్నుల అధికారం కేంద్రీకృతమై ఉన్న భూమిసంబంధాలను మార్చకోకుండా దున్నేవానికే భూమిదక్కకుండా ఈ సమస్య పరిష్కారం కాదన్నారు. అంటరానితనం, కులవివక్ష, దళితులపై దౌర్జన్యాలు, హత్యాకాండలకు వ్యతిరేకంగా ఆధిపత్య కులదురహంకార శక్తుల నుండి విడగొట్టుకొని అన్నికులాల్లోని పీడితులు, శ్రమజీవులైన పేదలు కులద్వేషాలకు గురికాకుండా దళితశక్తులతో కలిసి ఐక్యఉద్యమాలు సాగించాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ సభలో ఇంకా-ఆర్‌పిఐ(ఏపి) ప్రధానకార్యదర్శి పి.అంజయ్య, ఏఐకెఎమ్ఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టియు నాయకులు యు.వెంకటేశ్వర్లు, చుండూరు దళితుల న్యాయపోరాట కమిటి కోఆర్డినేటర్ కంచర్ల శేషు, శోషిత జనసభ రాష్ట్ర అధ్యక్షులు కె.రామలింగం, కులవివక్ష వ్యతిరేక పోరాటసమితి నాయకులు నటరాజ్, ఓపిడిఆర్ రాష్ట్రఅధ్యక్షులు కె.ఏసు, పౌరహక్కులసంఘం గుంటూరు జిల్లా నాయకులు డా॥టి.రాజారావు, స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్రసహాయ కార్యదర్శి బి.అరుణ, దళిత హక్కుల పోరాటసమితి నాయకులు కరవాది సుబ్బారావు, దళిత బహుజన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు నాగేశ్వరరావు, జనసాహితి రాష్ట్రనాయకులు కె.రవిబాబు, గుంటూరు జిల్లా దళిత నాయకులు డా॥రవికిరణ్ తదితరులు ప్రసంగించారు.

సదస్సుకు ముందుగా మధ్యాహ్నం ఒంటి గంట నుండి చుండూరు మారణకాండపై ప్రజా కళాకారులు ప్రదర్శించిన ‘నరమేధం’ మరియు ప్రజకళాకారుల సమాఖ్య, అరుణోదయ, ఆం.ప్ర. దళిత కళామండలి తదితర సంస్థల నుండి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, సభికులను ఆకట్టుకున్నాయి. ✡

# ‘అడవి నుండి గిరిజనులను తరిమివేసే పాలకుల కుట్రలకు వ్యతిరేకంగా పోరాడుదాం’

## కామ్రేడ్ జన్ని తిరుపతి వర్ధంతిసభలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సీ పిలుపు



వర్ధంతిసభలో ప్రసంగిస్తున్న కామ్రేడ్ ఝాన్సి; సభకు హాజరై కామ్రేడ్ తిరుపతికి నివాళులర్పిస్తున్న ప్రజానీకం

**దుగ్గేరు, 17-11-14 :**

విజయనగరం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు గ్రామంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లాకమిటి నాయకత్వంలో దుగ్గేరు గిరిజనోద్యమ ముద్దుబిడ్డ, అమరుడు కామ్రేడ్ జన్ని తిరుపతి 15వ వర్ధంతిసభ జరిగింది. ఈ సభకు ముఖ్యవక్తగా హాజరైన రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ అమాయకులైన ఆదివాసీలపై జరుగుతున్న దౌర్జన్యాలను ప్రశ్నించడానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సంఘం పెట్టి ముందుకెళుతున్న క్రమంలో, దీనిని సహించలేని భూస్వామ్య, పెత్తందారీ వర్గాలు పెద్దఎత్తున కుట్ర చేసి 1999 సం॥ నవంబర్ 17వ తారీఖున దుగ్గేరు గిరిజన గ్రామంపై దాడిచేసి కామ్రేడ్ జన్ని తిరుపతిని హత్య చేశారని పేర్కొంటూ కా॥ తిరుపతికి జోహార్లర్పించారు. కా॥ జన్ని తిరుపతిపై జరిగిన దాడిని ఎదుర్కొంటూ ప్రభుత్వ, పోలీసు నిర్బంధాలను అధిగమిస్తూ ఆనాటి నుండి ఈనాటిదాకా ప్రజలు పోరాట చైతన్యంతో సాగుతున్నారని అన్నారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు గిరిజన సాధికారత, గిరిజనాభివృద్ధి పేరుతో మోసం చేస్తూ గిరిజనుల యొక్క మౌలికసమస్యలైన భూమి సమస్య, అడవిపైన హక్కు సమస్యలను పరిష్కరించక పోగా అడవి నుండి ఆదివాసీలను దూరం చేయడానికి 1/70 చట్టాన్ని నీరుగార్చడం, లక్షల కోట్ల రూ॥లు విలువచేసే బాక్సైట్ సంపదను బహుళజాతి సంస్థలకు అప్పజెప్పడానికి పూనుకుంటున్నారన్నారు. 1967 అక్టోబర్ 31వ తేదీన శ్రీకాకుళ గిరిజనోద్యమ తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న, మంగన్నలను భూస్వామ్య పెత్తందార్లు హత్య గావిస్తే, రాజ్యం వారిని కాపుగాసిందని, కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్య, కారం పార్వతిలను హత్యచేసిన వారిని పాలకులు ఈనాటికీ శిక్షించలేదని, నాటినుండి నేటివరకు చరిత్రలో జరుగుతున్న వాస్తవమిదేనని ఆమె గుర్తుచేశారు. ఎన్నో పోరాటాలతో, ప్రాణ త్యాగాలతో గిరిజనులు సాధించుకున్న విజయాలను కూడా లాగివేసుకుంటున్నారని, గిరిజనులను మరల వడ్డీ దోపిడి, నాగుదోపిడీలకు గురిచేస్తూ వారి ఫలసాయంలో అధికమొత్తాన్ని దోపిడీ చేస్తున్నారన్నారు. భూములను కోల్పోయి, అడవినుండి గెంటివేయబడిన గిరిజనులు వలసకూలీలుగా కుటుంబాలను, గ్రామాలను వదలి పట్నాలుచేరి మరింత దుర్భర పరిస్థితులకు, దారుణ దోపిడీకి గురవుతున్న విషయాన్ని ఆమె పేర్కొన్నారు. కాగా, ఈ దోపిడీ తీవ్రత అర్థం కాకుండా వుండేందుకు పాలకులు పలు ప్రజాకర్షక పథకాలతో భ్రమలు కల్పిస్తూ, గిరిజన ప్రజానీకాన్ని వాటిచుట్టూ తిప్పుకుంటున్నారని చెపుతూ, గిరిజనులు దీనిపట్ల అప్రమత్తంగా వుంటూ సంఘచైతన్యంతో ఈ దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా, భూమిపై, అడవిపై హక్కు కోసం సంఘటితఉద్యమాలకు సమాయత్తం కావాలని, అదే సరైన అర్థంలో అమరవీరులకు అర్పించే నివాళిగా పేర్కొంటూ కా॥ఝాన్సీ తన ఉపన్యాసాన్ని ముగించారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ మాట్లాడుతూ జిల్లాలో 170 గిరిజన గ్రామాలు నేటికీ షెడ్యూల్డు (ఏజెన్సీ) ప్రాంతంగా ప్రకటించకుండా గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని, విజయనగరం జిల్లా వెనుకబడివుందని, అందువలన జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటుచేస్తామని జిల్లా మంత్రులు, ముఖ్యమంత్రి ప్రకటించారని అదే నేడు విజయనగరం జిల్లాలో కాకుండా వేరే జిల్లాకు కేటాయిస్తున్నామని ప్రకటనలు చూస్తుంటే. గిరిజనుల పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరి వెల్లడవుతున్నదని విమర్శించారు.

మక్కువ, సాలూరు, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ మండలాల నుండి 1000మంది గిరిజనులు హాజరైన ఈ సభకు రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు అధ్యక్షతవహించారు. ఇంకా ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ ఎమ్. గోపాలం, పనసభద్ర సర్పంచ్ రతనాల పార్వతి, పనసభద్ర ఎంపిటిసి గంట అప్పలస్వామి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కామ్రేడ్స్ పి. శ్రీను నాయుడు, బొత్స నర్సింగరావు, ఎమ్. భాస్కరరావు, ఎన్‌వైయస్ జిల్లా కార్యదర్శి పి. అసిరి తదితరులు మాట్లాడారు. ఎర్రతోరణాలు, జెండాలు, బ్యానర్లతో దుగ్గేరు గ్రామం ఎర్రబారి అమరుడు జన్ని తిరుపతికి జోహార్లు అర్పించింది. ప్రజాకళాకారుల పాటలు గిరిజన ప్రజలలో స్ఫూర్తిని రగిలించాయి. ✡

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010